సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
బుధవారం, 12.08.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 282
పేజీలు: 08 వెల: రూ. 5


## దేశంలో ప్లాస్టిక్ నోట్లకు కేంద్రం ఆమోదం 02

### కరెన్సీ రంగంలో విప్లవాత్మక మార్పులు..

- ఇక చిరగవు.. తడవవు!
- కాగితానికి గుడ్‌బై? ప్లాస్టిక్ నోట్లపై కేంద్రం కీలక నిర్ణయం
- తొలుత రూ.10, రూ.20 నోట్లు



రేవంత్ బ్రదర్స్ కంపెనీలను

## బయటపెడతాం

బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ 03



- చిన్న చిన్న ఇంటి అడ్రస్‌తో పెద్ద పెద్ద కంపెనీలు
- రూ.200 కోట్ల భూమిపై సంచలన ఆరోపణలు
- టెన్సెరాక్ట్ భూకేటాయింపుపై దుమారం

హైదరాబాద్‌లో

## ట్రంప్ టవర్స్

టీ-రెరా గ్రీన్ సిగ్నల్..

- కోకాపేట్‌లో 65 అంతస్తుల ట్విన్ టవర్స్
- రూ.3,500 కోట్లతో అల్ట్రా లగ్జరీ ప్రాజెక్ట్
- హైదరాబాద్‌లో 5వ ట్రంప్ టవర్స్ ప్రాజెక్ట్ 02




## మక్కా డీల్ ముందే ధోవల్ ఎంట్రీ



టర్కీ, పాక్ తో సౌదీ డీల్..

- సౌదీ డీల్‌పై భారత్‌కు ముందే సమాచారం
- మక్కా ఒప్పందంపై భారత్ షాక్ కానిది అందుకే?
- దోవల్ 'సౌదీ' టూర్‌తో ఏం జరిగింది? 02

3.43 కోట్ల మందికి

## స్మార్ట్ ఆహార భద్రత

ఆగస్టు 15న సంగారెడ్డి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సీఎం శ్రీకారం



- 33 జిల్లాల్లో ఏకకాలంలో కార్యక్రమాలు
- 1.06 కోట్ల కార్డులు.. ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల ఉచిత సన్నబియ్యం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 03

నిషేధిత భూములపై ప్రజలకు

## ఆందోళన వద్దు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



- అర్హులకు అన్యాయం జరుగదు
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ లేదు
- సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలకు చెక్
- ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల మేరకే నిర్ణయాలు

03

## 73.52 లక్షల ఓట్లు

# గల్లంతు

### భారీగా ఓట్లు మాయం

## రాష్ట్ర వ్యాప్తంగా 21.70 శాతం తగ్గిన ఓట్లు

### ఎస్ఐఆర్ పై తెలంగాణ సీఈవో ప్రకటన



- ఓట్ల గల్లంతులో హైదరాబాద్ టాప్
- 20 లక్షల ఓట్లపై సందేహం
- ఆగస్టు 17న ఓటర్ల జాబితా విడుదల
- పేరు లేకపోతే ఆందోళన వద్దు
- ఫారం-6తో మళ్లీ ఓటు నమోదు
- సెప్టెంబర్ 30 వరకు క్లెయిమ్‌లకు ఛాన్స్
- అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా
- ఎస్ఐఆర్ తో ఓటర్ల జాబితా ప్రక్షాళన

**ముద్ర డెస్క్:**
తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. రాష్ట్ర ఎన్నికల అధికారులు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ–2026 (SIR) ప్రక్రియ సోమవారంతో ముగిసింది. ఇంటింటి సర్వే, ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియలో భారీ సంఖ్యలో ఓటర్ల వివరాలు పరిశీలన పరిధిలోకి వచ్చాయి. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న మొత్తం 3,38,26,448 మంది ఓటర్లలో 2,64,73,616 మంది వివరాలు మాత్రమే డిజిటలైజేషన్ పూర్తయింది. అంటే మొత్తం ఓటర్లలో 78.26 శాతం మంది వివరాలు మాత్రమే ప్రక్రియలో పూర్తయ్యాయి. మిగిలిన 73,52,832 మంది ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించకపోవడం, క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవడం తదితర కారణాలతో ఏఎస్‌డీ జాబితాలోకి వెళ్లారు.
అయితే ఏఎస్‌డీ జాబితాలో పేరు చేరిందంటే ఓటు హక్కు పూర్తిగా రద్దయినట్టుగా భావించాల్సిన అవసరం లేదని మిగతా 02లో



## ఎర్రకోటపై

# వందేమాతరం

### చరిత్రలోనే తొలిసారి..

### స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఆలాపన

- 150 ఏళ్ల వందేమాతరానికి ఘన నివాళి!
- స్వాతంత్ర్య వేడుకల్లో వందేమాతరం ప్రత్యేక ఆకర్షణ!
- 80వ స్వాతంత్ర్య దినోత్సవానికి 'వికసిత్ భారత్ 2047' థీమ్!
- మోదీ రాక వేళ ఎర్రకోటపై సందడి

**ముద్ర డెస్క్ :**
దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోట ప్రాంగణం ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఒక అపూర్వమైన ఘట్టానికి సాక్ష్యంగా నిలవబోతోంది. భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో భాగంగా తొలిసారిగా జాతీయ గేయం 'వందేమాతరం'ను ఎర్రకోట వద్ద ఆలపించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోటకు చేరుకునే సమయంలో ఈ గీతాలాపన జరుగుతుందని.. అనంతరం ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తారని రక్షణ శాఖ వెల్లడించింది.

**150 ఏళ్ల ఘన చరిత్రకు నివాళి!**
ఈ వినూత్న నిర్ణయం వెనుక ఉన్న విశేషాలను రక్షణ కార్యదర్శి ఆర్.కె. సింగ్ వివరించారు. ప్రముఖ బెంగాలీ రచయిత బంకిం చంద్ర ఛటర్జీ రచించిన 'వందేమాతరం' గీతం రూపుదిద్దుకుని 2026 నాటికి సరిగ్గా 150 సంవత్సరాలు పూర్తి అవుతోంది. ఆ అమర గీత వారసత్వానికి, ప్రాముఖ్యతకు ఘన నివాళిగా ఎర్రకోట బురుజుల నుంచి దీనిని ఆలపించాలని నిర్ణయించారు. సాధారణంగా ఈ గేయంలోని మొదటి రెండు చరణాలను మాత్రమేఆలపించే సాంప్రదాయం ఉండేది. అయితే జాతీయ గీతం 'జనగణమన'తో సమానంగా మిగతా 02లో

ఎల్‌నినో సంక్షోభంలో 02

## సానుకూల వృద్ధి

సామాన్యుడిపై ధరల భారం లేకుండా కార్యాచరణ

జీఎస్డీపీ, నెలవారీ ఆర్థిక నివేదికపై చంద్రబాబు సమీక్ష



15 శాతం వృద్ధిరేటు సాధించేలా సమగ్ర ప్రణాళికలు

2026, జూలై ఆర్థిక నివేదిక సీఎంకు అందించిన ప్రణాళికా విభాగం

కొత్త బొగ్గు బ్లాకులు

## కేటాయించండి

సీఎం రేవంత్ రెడ్డి

- ప్రధాని మోదీకి లేఖ రాసిన సీఎం
- సింగరేణికి కోయగూడెం, సత్తుపల్లి బ్లాకులు కేటాయించాలని విజ్ఞప్తి

**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణ విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు కొత్త బొగ్గు బ్లాకులను కేటాయించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు 2024 జూలై 4న ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం లేఖ రాశారు.
తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం 51:49 నిష్పత్తిలో సంయుక్తంగా నిర్వహిస్తున్న సింగరేణి ప్రస్తుతం ఏడాదికి సుమారు 70 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేస్తోందని సీఎం లేఖలో పేర్కొన్నారు. సింగరేణి ద్వారా ప్రత్యక్షంగా సుమారు 43 వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభిస్తోందని తెలిపారు.
ప్రస్తుతం సింగరేణి 17 ఓపెన్‌కాస్ట్, 22 భూగర్భ గనులను నిర్వహిస్తోందని, 2024–25లో సుమారు 72 MTPA ఉత్పత్తి సామర్థ్యం ఉందని సీఎం వివరించారు. 2032–33 నాటికి 22 గనులు మిగతా 02లో



ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం, 12.08.2026
www.mudranews.in | @mudranews



### పాముకాటేస్తే ఆసుపత్రికి తీసుకెళ్లండి



పాము కరిచిన వ్యక్తిని నడిపించకూడదు. నడవడం, పరుగెత్తడం వల్ల విషం శరీరంలో వేగంగా వ్యాపించే అవకాశం ఉంటుంది. వాహనంలో వీలైనంత త్వరగా సమీప ఆసుపత్రికి తీసుకెళ్లాలి. అవసరమైతే వైద్య సిబ్బందికి పాము కాటు జరిగిన సమయం, కనిపించిన లక్షణాలు వివరించాలి.

## దేశంలో ప్లాస్టిక్ నోట్లకు
# కేంద్రం ఆమోదం



**ముద్ర, ఢిల్లీ :** భారతీయ కరెన్సీ రంగంలో విప్లవాత్మక మార్పులకు రంగం సిద్ధమవుతోంది. దేశంలో తొలిసారిగా ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) ఆమోదం తెలిపాయి. ఇందులో భాగంగా అత్యధికంగా చెలామణిలో ఉండే తక్కువ విలువ కలిగిన రూ.10, రూ.20 నోట్లను ప్లాస్టిక్ మెటీరియల్‌తో ముద్రించి, ఫీల్డ్‌లో ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రకటించారు. రిజర్వ్ బ్యాంక్ చేసిన ప్రతిపాదన మేరకు తొలుత వంద కోట్ల చొప్పున నోట్లను విడుదల చేయనున్నారు.
సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే ప్లాస్టిక్ నోట్ల ఆయుష్షు చాలా ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా రూ.10, రూ.20 వంటి చిన్న నోట్లు చేతులు మారుతుండటం వల్ల త్వరగా పాడైపోతుంటాయి. పాలిమర్ నోట్ల ద్వారా ఆ సమస్య తీరడంతో పాటు నకిలీ నోట్ల బెడదను కూడా సమర్థవంతంగా అరికట్టవచ్చని భావిస్తున్నారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, అంతా అనుకున్నట్లుగా జరిగితే 2027 ఏప్రిల్ నాటికి ప్లాస్టిక్ నోట్లను పూర్తిస్థాయిలో సర్క్యులేషన్‌లోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఇటీవల తెలిపారు. ప్రస్తుతానికి ఇది కేవలం ప్రయోగాత్మక దశ మాత్రమేనని, మార్కెట్లో ఉన్న పాత కాగితపు నోట్లు యథావిధిగా కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

## మక్కా డీల్ కు ముందే
# అజిత్ ధోవల్ ఎంట్రీ



**ముద్ర డెస్క్ :** సౌదీ అరేబియా, పాకిస్తాన్, తుర్కియే మధ్య కుదిరిన 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్' పశ్చిమాసియా భద్రతా సమీకరణాల్లో కీలక పరిణామంగా మారింది. అయితే ఈ ఒప్పందంపై భారత్‌కు ముందే సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. ఒప్పందానికి ముందు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సౌదీ అరేబియాలో పలు పర్యాయాలు పర్యటించడం దీనికి బలాన్నిస్తోంది. 2026లో దోవల్ ఫిబ్రవరి, ఏప్రిల్, జూలైలో సౌదీని సందర్శించారు. జూలై పర్యటనలో సౌదీ కీలక అధికారులతో ప్రాంతీయ భద్రత, ఇంధన సరఫరా, సముద్ర మార్గాల రక్షణ వంటి అంశాలపై చర్చలు జరిపారు. దీంతో మక్కా ఒప్పందానికి సంబంధించిన పరిణామాలను భారత్ ముందుగానే అంచనా వేసిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.
మరోవైపు ఈ ఒప్పందంతో పాకిస్తాన్‌కు సైనిక, దౌత్యపరమైన ప్రాధాన్యం పెరిగినట్లు కనిపిస్తున్నప్పటికీ.. భారత్‌కు తక్షణ సైనిక ముప్పు లేదని విశ్లేషకులు చెబుతున్నారు. సౌదీతో భారత్‌కు బలమైన వ్యూహాత్మక, ఆర్థిక, ఇంధన సంబంధాలు ఉండటంతో ప్రాంతీయ పరిణామాలపై ఢిల్లీ నిశితంగా దృష్టి పెట్టింది. మొత్తంగా చూస్తే.. సౌదీ–పాక్–తుర్కియే కూటమి కొత్త సమీకరణాలకు తెరతీసినా, దోవల్ చురుకైన దౌత్యం కారణంగా భారత్ ఈ పరిణామాన్ని షాక్‌గా కాకుండా ముందస్తు అవగాహనతో ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది.

## 73.52 లక్షల ఓట్లు
# గల్లంతు




(మొదటి పేజీ తరువాయి)
అధికారులు స్పష్టం చేస్తున్నారు. ముసాయిదా జాబితా విడుదల తర్వాత అభ్యంతరాలు, క్లెయిమ్‌లకు అవకాశం కల్పించనున్నారు. సంబంధిత ఆధారాలను సమర్పించి ఓటర్లు తమ పేర్లను తిరిగి జాబితాలో చేర్చుకునే అవకాశం ఉంటుంది.

### 73.52 లక్షల మంది ఎక్కడికి వెళ్లారు?

SIR ప్రక్రియలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు (BLOలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించారు. అయితే పలువురు ఓటర్లు ఇళ్ల వద్ద అందుబాటులో లేకపోవడం, చిరునామాలు మారిపోవడం, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోవడం, మరణించిన వ్యక్తుల పేర్లు కొనసాగడం, ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లు ఉండటం వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి.
ఈ నేపథ్యంలో ఎన్యుమరేషన్ ఫారాలు అందని లేదా వివరాలను ధ్రువీకరించలేని ఓటర్లను తాత్కాలికంగా ఏఎస్‌డీ జాబితాలో చేర్చారు. ఇందులో 'అన్‌కలెక్టబుల్'గా గుర్తించిన ఓటర్లు కూడా గణనీయ సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. నివాస ప్రాంతం నుంచి శాశ్వతంగా వలస వెళ్లిన వారు, మరణించిన వారు, డూప్లికేట్ ఓటర్లు కూడా ఈ జాబితాలోకి వెళ్లారు.

### హైదరాబాద్‌లోనే అత్యధిక ప్రభావం

ఓటర్ల జాబితా ప్రక్షాళనలో పట్టణ ప్రాంతాలపై ఎక్కువ ప్రభావం కనిపిస్తోంది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పరిస్థితి అత్యంత కీలకంగా మారింది. ఇక్కడ సుమారు 60 శాతం మేర మాత్రమే ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తయినట్లు సమాచారం. దీంతో దాదాపు 20 లక్షల ఓటర్ల వివరాలు ఏఎస్‌డీ జాబితాలోకి వెళ్లినట్లు తెలుస్తోంది.
హైదరాబాద్‌లో వివిధ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు ఉద్యోగాలు, వ్యాపారాలు, విద్య తదితర కారణాలతో తరచూ నివాసాలు మార్చుకుంటుండటమే ఇందుకు ప్రధాన కారణంగా అధికారులు భావిస్తున్నారు. ఒక ప్రాంతంలో ఓటరుగా నమోదై ఉండి మరో ప్రాంతానికి మారిపోయినప్పటికీ పాత చిరునామాలోనే పేరు కొనసాగుతున్న సందర్భాలు కూడా ఉన్నట్లు గుర్తించారు.

### మేడ్చల్, రంగారెడ్డిలోనూ భారీగా..

గ్రేటర్ హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల్లోనూ డిజిటలైజేషన్ శాతం తక్కువగానే నమోదైంది. మేడ్చల్–మల్కాజ్‌గిరిలో 70 శాతం, రంగారెడ్డి జిల్లాలో 65 శాతం మేర ఓటర్ల వివరాలు డిజిటలైజేషన్ పూర్తయ్యాయి. ఈ ప్రాంతాల్లో భారీగా వలసలు, కొత్త నివాస ప్రాంతాల ఏర్పాటుతో ఓటర్ల చిరునామాల్లో మార్పులు చోటుచేసుకోవడం కూడా ప్రధాన కారణంగా కనిపిస్తోంది.
మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ మెరుగ్గా సాగింది. యాదాద్రి భువనగిరి జిల్లా 95 శాతం డిజిటలైజేషన్‌తో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. జనగామ 92 శాతంతో రెండో స్థానంలో ఉండగా.. మెదక్, సూర్యాపేట జిల్లాలు 91 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

### 89 లక్షల ఓట్లలో 11 రకాల తేడాలు

ఇదిలా ఉండగా గతంలో నిర్వహించిన మ్యాపింగ్ ప్రక్రియలో సుమారు 89 లక్షల ఓట్లలో 11 రకాల వ్యత్యాసాలను అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఓటర్ల పేరు, చిరునామా, వయస్సు, ఇతర వివరాల్లో తేడాలు, ఒకే వ్యక్తికి వేర్వేరు ప్రాంతాల్లో ఓట్లు ఉండటం వంటి అంశాలను పరిశీలించారు.
ఆ వ్యత్యాసాలను సరిచేసిన తర్వాత కూడా 50 లక్షలకుపైగా ఓట్లలో వివిధ రకాల తేడాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వివరాలపై కూడా ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత అధికారులు దృష్టి సారించే అవకాశం ఉంది. సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసి వివరాలను ధ్రువీకరించే ప్రక్రియ చేపట్టవచ్చని అధికారులు చెబుతున్నారు.

### ఆగస్టు 17న అసలు చిత్రం

ఇప్పటి వరకు జరిగిన ప్రక్రియలో తాత్కాలికంగా గుర్తించిన వివరాలన్నింటికీ స్పష్టత ఆగస్టు 17న రానుంది. ఆ రోజున SIR అనంతరం ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయనున్నారు. దీంతో ఏయే పేర్లు జాబితాలో ఉన్నాయి? ఎవరెవరి పేర్లు లేవు? ఎవరిని ఏఎస్‌డీ జాబితాలో చేర్చారు? వంటి అంశాలపై పూర్తి స్పష్టత వస్తుంది.
ముసాయిదా జాబితాలో తమ పేరు లేకపోయినా, లేదా ఏఎస్‌డీ జాబితాలో తమ పేరు ఉన్నా ఓటర్లు వెంటనే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఈ సమయంలో తమ పేరు జాబితాలో చేర్చాలని కోరుతూ సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

### అక్టోబర్ 19న తుది జాబితా

ముసాయిదా జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, క్లెయిమ్‌లను అధికారులు పరిశీలించనున్నారు. అవసరమైన ఆధారాలు, పత్రాలను పరిశీలించి అర్హులైన ఓటర్ల పేర్లను జాబితాలో చేర్చడంతో పాటు అనర్హమైన లేదా డూప్లికేట్ నమోదులను తొలగించే ప్రక్రియ కొనసాగుతుంది. అక్టోబర్ 15లోపు వచ్చిన దరఖాస్తులను పరిష్కరించి.. అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు.

### పేరు లేకపోతే ఏం చేయాలి?

ముసాయిదా జాబితాలో మీ పేరు కనిపించకపోతే ముందుగా ఎన్నికల సంఘం అధికారిక ఈ–పోర్టల్ లేదా ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌లో మీ వివరాలను తనిఖీ చేసుకోవాలి. ఏఎస్‌డీ జాబితాలో పేరు ఉన్నట్లయితే అందుకు గల కారణాన్ని తెలుసుకుని, తగిన ఆధారాలతో సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిని సంప్రదించాలి.
ఒకవేళ ఓటరు పేరు తొలగించబడినట్లయితే నిబంధనల ప్రకారం ఫారం–6 ద్వారా ఓటరుగా కొత్తగా నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. ఎన్నికల సంఘం గుర్తించిన చెల్లుబాటు అయ్యే గుర్తింపు, నివాస ధ్రువీకరణ పత్రాల్లో తగిన వాటిని సమర్పించి తమ అర్హతను నిరూపించుకోవచ్చు.

### ఫారం ఇవ్వలేదని ఓటు పోయినట్టేనా?

ఇది ఓటర్లలో ప్రస్తుతం నెలకొన్న ప్రధాన సందేహం. ఎన్యుమరేషన్ ఫారం సమర్పించలేదని మాత్రమే ఓటు హక్కు వెంటనే రద్దు కాదని అధికారులు చెబుతున్నారు. ఓటరు వివరాలపై సందేహం ఉంటే నిబంధనల ప్రకారం నోటీసు జారీ చేసి, సంబంధిత వ్యక్తికి వివరణ ఇచ్చే అవకాశం కల్పించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటారు. అందువల్ల ఆగస్టు 17న ముసాయిదా జాబితా విడుదలైన వెంటనే ప్రతి ఓటరూ తమ పేరు, చిరునామా, పోలింగ్ కేంద్రం తదితర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవడం కీల కం. పేరు లేకపోయినా గడువులోపు క్లెయిమ్ దాఖలు చేస్తే తిరిగి ఓటు హక్కును పొందే అవకాశం ఉంటుంది.

### ఓటర్లకు కీలక సూచన

SIR ప్రక్రియతో ఓటరు జాబితాలో అనర్హులు, డూప్లికేట్ ఓట్లు, మరణించిన వ్యక్తుల పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి నమోదులను గుర్తించి జాబితాను మరింత పారదర్శకంగా మార్చడమే ఎన్నికల సంఘం లక్ష్యంగా చెబుతోంది. అయితే ఈ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు పొరపాటున తొలగిపోకుండా ప్రతి ఓటరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఆగస్టు 17న ముసాయిదా జాబితా విడుదల.. సెప్టెంబర్ 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు.. అక్టోబర్ 15లోపు పరిష్కారం.. అక్టోబర్ 19న తుది జాబితా ఈ గడువులను ఓటర్లు గుర్తుంచుకోవాలి. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్–మల్కాజ్‌గిరి, రంగారెడ్డి వంటి పట్టణ ప్రాంతాల్లో నివసించే వారు తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## హైదరాబాద్ లో
# ట్రంప్ టవర్స్




**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని ప్రముఖ ఐటీ కారిడార్ అయిన కోకాపేట్ గోల్డెన్ మైల్ ప్రాంగణం మరో భారీ అంతర్జాతీయ విలాసవంతమైన ప్రాజెక్ట్‌కు వేదిక కాబోతోంది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ట్రంప్ ఆర్గనైజేషన్ భాగస్వామ్యంతో ఏకంగా 65 అంతస్తులతో ట్విన్ టవర్ల నిర్మాణానికి రంగం సిద్ధమైంది. నగరంలో అత్యున్నత జీవన ప్రమాణాలను ప్రతిబింబించేలా రూపొందించిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ నుంచి అధికారిక అనుమతులు లభించాయి. సుమారు రూ.3,500 కోట్ల భారీ అంచనా వ్యయంతో రూపుదిద్దుకుంటున్న ఈ లగ్జరీ ప్రాజెక్ట్‌ను అమెరికాకు చెందిన ట్రంప్ ఆర్గనైజేషన్, భారత్‌లో ఆ సంస్థ భాగస్వామి అయిన ట్రిబెకా డెవలపర్స్, నగరానికి చెందిన ఐరా రియాల్టీ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. గురుగ్రామ్, ముంబై, పుణే, కోల్‌కతా నగరాల తర్వాత భారతదేశంలో నిర్మితమవుతున్న 5వ ట్రంప్ టవర్స్ ప్రాజెక్ట్ ఇదే కావడం గమనార్హం.
450 అత్యంత ఖరీదైన 'అల్ట్రా లగ్జరీ' ఫ్లాట్లు సుమారు 4 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న ఈ ట్విన్ టవర్లలో కేవలం 450 అత్యంత ఖరీదైన ఫ్లాట్లను మాత్రమే నిర్మించనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా గ్లాస్ ఫ్యాకేడ్ డిజైన్, స్మార్ట్ హోమ్ ఆటోమేషన్, ప్రైవేట్ వ్యూయింగ్ డెక్స్‌లతో పాటు 3.5 బీహెచ్‌కే, 4 బీహెచ్‌కే, స్కై డుప్లెక్స్ మోడళ్లలో ఈ ఫ్లాట్లు అందుబాటులోకి రానున్నాయి. వీటితో పాటు ఈ ట్విన్ టవర్లను కలుపుతూ మధ్యలో వినూత్నంగా ఏర్పాటు చేయనున్న 'స్కై బ్రిడ్జ్' ఈ ప్రాజెక్ట్‌కు స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలవనుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ నిర్మాణ పనులను ప్రారంభించిన మూడేళ్ల వ్యవధిలోనే పూర్తి చేయాలని భాగస్వామ్య సంస్థలు టార్గెట్‌గా పెట్టుకున్నాయి. అయితే, ప్రాజెక్ట్ భూమి పూజ, గ్రాండ్ లాంచ్ కార్యక్రమంలో ట్రంప్ ఫ్యామిలీ మెంబర్స్‌కు కూడా స్వయంగా పాల్గొనబోతున్నట్లుగా తెలుస్తోంది. ఓ వైపు ఔటర్ రింగ్ రోడ్డు, మరోవైపు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉండే కోకాపేటలో ఈ ట్రంప్ టవర్స్ ప్రాజెక్ట్ రాకతో హైదరాబాద్ గ్లోబల్ రియల్ ఎస్టేట్ రంగానికి సరికొత్త గుర్తింపు లభించనుంది.

## ఎల్‌నినో సంక్షోభంలోనూ
# సానుకూల వృద్ధి

(మొదటి పేజీ తరువాయి)
**ముద్ర, అమరావతి:** ఎల్‌నినో ప్రభావం, లోటు వర్షపాతం వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ సానుకూల వృద్ధిని నమోదు చేస్తోందని జూలై 2026 నెలవారీ ఆర్థిక నివేదిక వెల్లడించింది. 2025–26 రెండో త్రైమాసికంలో రాష్ట్రం 10.7 శాతం వృద్ధిరేటు సాధించింది. వ్యవసాయ రంగం 13.5 శాతం, పరిశ్రమలు 10.6 శాతం, సేవల రంగం 9.9 శాతం వృద్ధిని నమోదు చేశాయి.
జీఎస్టీ వసూళ్లు 21 శాతం పెరిగి రూ.13,282 కోట్లకు చేరగా, సాధారణ ఎగుమతులు రూ.16,322 కోట్లకు చేరాయి. ఎస్‌టీపీఐ ఎగుమతులు 32.2 శాతం, వాణిజ్య వాహనాల నమోదు 51.6 శాతం పెరిగాయి. భారీ ప్రాజెక్టులు, ఎంఎస్‌ఎంఈ రంగంలో పెట్టుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నాయని నివేదిక పేర్కొంది.
ఈ నివేదికపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించి, ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ శాఖ నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా వనరులను సమర్థంగా వినియోగించాలని ఆదేశించారు. ప్రజలపై ధరల భారం పడకుండా చర్యలు తీసుకోవాలని, నీటి లభ్యత, ఉత్పత్తులకు విలువ జోడింపు వంటి అంశాలపై కంటింజెన్సీ ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. ఏపీ 15 శాతం వృద్ధిరేటు సాధించే దిశగా సమగ్ర కార్యాచరణ చేపట్టాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## ఎర్రకోటపై
# వందేమాతరం..

(మొదటి పేజీ తరువాయి)
వందేమాతరానికి గౌరవం దక్కాలని, అందులోని మొత్తం ఆరు చరణాలను ఆలపించాలని కేంద్ర ప్రభుత్వం చాటి చెబుతోంది. ఇటీవలే వందేమాతరాన్ని అవమానించడాన్ని నేరంగా పరిగణిస్తూ పార్లమెంటు ఒక బిల్లును ఆమోదించింది. అలాగే ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల ప్రారంభంలో ప్రాధాన్యతగా వందేమాతరం పాటించాలని కేంద్రం ఆదేశించడమే కాకుండా పలు రాష్ట్రాలు పాఠశాలల్లో దీనిని నిర్బంధం చేశాయి. అయితే ఈ గీతంలోని కొన్ని చరణాలు తమ మత విశ్వాసాలకు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొంటూ కొన్ని ముస్లిం సంస్థలు పూర్తి గీతాన్ని ఆలపించడంపై అభ్యంతరం వ్యక్తం చేశాయి.

**'వికసిత్ భారత్ 2047'.. యువతదే కీలక పాత్ర!**

2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో యువత అందిస్తున్న సహకారాన్ని గౌరవిస్తూ ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవానికి ప్రత్యేక థీమ్‌ను ఖరారు చేశారు. ఇటీవల ప్రశ్నపత్రాల లీకేజీలపై జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన భారీ నిరసనల నేపథ్యంలో ఈ థీమ్ ఎంచుకున్నారా అని అడిగిన ప్రశ్నకు రక్షణ కార్యదర్శి స్పష్టత ఇచ్చారు. జంతర్ మంతర్ ఆందోళనల కంటే ముందే యువత పాత్రను వేడుకల్లో ప్రముఖంగా చాటాలనే ప్రణాళిక సిద్ధమైందని ఆయన తెలిపారు. 2047 నాటి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత భాగస్వామ్యం, వారి పురోగతి ఎంతో కీలకమని.. అందుకే ఈ థీమ్‌ను రూపొందించామని వెల్లడించారు. భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసి, ప్రధాని మోదీ నాయకత్వంలో 80వ స్వాతంత్ర్య వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు.

## తెలంగాణకు కొత్త బొగ్గు బ్లాకులు
# కేటాయించండి

(మొదటి పేజీ తరువాయి)
మూసివేయాల్సి రావడంతో ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోయే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చేందుకు 4,000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంలో ఉందని, రామగుండంలో మరో 4,000 మెగావాట్ల NTPC విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయాల్సి ఉందని సీఎం పేర్కొన్నారు. ఈ రెండు ప్లాంట్లకు కలిపి సుమారు 40 MTPA బొగ్గు అవసరం ఉంటుందని తెలిపారు.
రెండు బొగ్గు బ్లాకులు సింగరేణికి ఇవ్వాలి కోయగూడెం బ్లాక్–III, సత్తుపల్లి బ్లాక్–IIIలను వేలం ద్వారా ఇతర సంస్థలకు కేటాయించినప్పటికీ అవి ఇప్పటివరకు కార్యకలాపాలు ప్రారంభించలేదని సీఎం పేర్కొన్నారు. అందువల్ల ఈ రెండు బ్లాకులను MMDR Act, 1957లోని Section 11A/17(A)(2) కింద సింగరేణికి కేటాయించాలని కోరారు.
ఈ బ్లాకుల కేటాయింపుతో వచ్చే ఆదాయ వాటా కంటే 0.5 శాతం అదనంగా చెల్లించేందుకు సింగరేణి సిద్ధంగా ఉందని లేఖలో తెలిపారు.
అలాగే సింగరేణి పరిధిలోని శ్రావణపల్లి బ్లాక్‌ను రాబోయే బొగ్గు బ్లాకుల వేలం నుంచి తొలగించి, అదే చట్టంలోని నిబంధనల ప్రకారం సింగరేణికి కేటాయించాలని సీఎం విజ్ఞప్తి చేశారు.
కోయగూడెం బ్లాక్–III, సత్తుపల్లి బ్లాక్–IIIతో పాటు PK OC–II డిప్‌సైడ్ బ్లాక్, గోదావరి వ్యాలీ కోల్‌ఫీల్డ్‌లో సింగరేణి గుర్తించిన ఇతర బ్లాకులను కూడా కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీని కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 12.08.2026
www.mudranews.in | @mudranews



## పాముకాటు పైన గట్టిగా కట్టు కట్టొద్దు

తాడు, ప్లాస్టిక్ తీగ లేదా ఇతర వస్తువులతో బిగుతుగా కట్టడం ప్రమాదకరం. దీనివల్ల రక్తప్రసరణ దెబ్బతిని శరీర భాగం తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంటుంది. కట్టాల్సిన పరిస్థితి ఉంటే చాలా బిగుతుగా కాకుండా, వైద్య సలహాతో మాత్రమే చేయడం మంచిది. తలపై పాము కరిస్తే కట్టు కట్టకూడదు.



# రేవంత్‌రెడ్డి షెల్ కంపెనీల బాగోతాన్ని బయట పెడతాం

**– రేవంత్ రెడ్డి బ్రదర్స్‌కు చిన్న చిన్న ఇంటి అడ్రస్‌తో పెద్ద పెద్ద కంపెనీలు**
**- రేవంత్ బ్రదర్స్ కంపెనీలపై కేటీఆర్ ఫైర్**
**- రూ.200 కోట్ల భూమిపై సంచలన ఆరోపణలు**
**- టెస్సెరాక్ట్ భూకేటాయింపుపై దుమారం**

**ముద్ర హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయం రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డి చుట్టూ తిరుగుతున్న టెస్సెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ వివాదంతో తీవ్ర వేడెక్కింది. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 200 కోట్ల విలువైన భూమిని కేవలం రూ. 1 లక్ష కేపిటల్ ఉన్న ఒక షెల్ కంపెనీకి కట్టబెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఈ వ్యవహారాన్ని తొలుత బయటపెట్టగా కేటీఆర్ విలేకరుల సమావేశంలో దీనిపై ఆధారాలను బయటపెట్టారు. పటాన్‌చెరులోని ఒక చిన్న ఇంటి చిరునామాతో నమోదైన 'టెస్సెరాక్ట్' సంస్థకు ఒక్క ఉద్యోగి కూడా లేరని కేటీఆర్ అన్నారు. కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లో ఫోన్ నంబర్‌గా 12345678 అని పొందుపరచడం ఈ సంస్థ విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తోందన్నారు.

రూ. 200 కోట్ల విలువైన భూకేటాయింపులను ప్రారంభ మూలధనం కేవలం లక్ష రూపాయలు మాత్రమే ఉన్న అనామక సంస్థకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఇది ఐదు ఎకరాల అత్యంత ఖరీదైన భూమిని అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సోదరుడు కొండల్ రెడ్డికి ఈ సంస్థతో ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కొండల్ రెడ్డి స్వయంగా తన లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో టెస్సెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, భూపాల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్‌కు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నట్లు స్పష్టంగా పేర్కొన్నారని ఆధారాలు చూపించారు. అంతేకాకుండా యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్ ఎగ్జిక్యూటివ్ బోర్డులో టెస్సెరాక్ట్ చైర్మన్‌గా కొండల్ రెడ్డికి లభించిన ఆహ్వానాలు, వీరి ఏరోస్పేస్ కంపెనీ కార్యక్రమానికి అమెరికన్ కాన్సుల్ జనరల్ హాజరు కావడం వంటి విషయాలను కేటీఆర్ ప్రస్తావించారు. సొంత శాఖలో జరుగుతున్న అక్రమాలపై పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు కనీస అవగాహన ఉందా అని కేటీఆర్ నిలదీశారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన స్క్రిప్ట్‌ను గుడ్డిగా చదవడం



మాని, కొండల్ రెడ్డి బహిరంగంగా ప్రచారం చేసుకుంటున్న వాస్తవాలను గుర్తించాలని హితవు పలికారు.

గతంలో రేవంత్ రెడ్డి సోదరులు, బావమరిది కంపెనీలకు అమృత్ పథకంలో కాంట్రాక్టులు ఇచ్చారనే విమర్శలు ఉండగా, ఇప్పుడు టెస్సెరాక్ట్ పేరుతో కొత్త భూముల కేటాయింపు స్కామ్ బయటపడటం తెలంగాణ రాజకీయాల్లో పెద్ద దుమారాన్నే రేపుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఈ భూకేటాయింపుపై పారదర్శకమైన విచారణ జరిపించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోంది.

## కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ ఆంక్షలు

**ఈనెల 18 నుంచి వన్‌వే**

**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ వన్‌వే అమల్లోకి రానుంది. ఈనెల 18 నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ అండర్ పాస్ ఫ్లైఓవర్ల నిర్మాణంతో వన్ వే అమలు చేయనున్నారు. అండర్ పాస్ ఫ్లైఓవర్ల నిర్మాణం పూర్తయ్యే వరకు వన్ వే అమలులో ఉండనున్నట్లు హైదరాబాద్ సీపీ సజ్జనర్ ప్రకటించారు. వన్ వే కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కేబీఆర్ పార్క్ పరిసర కారిడార్‌లో 'హెచ్-సిటీ' ప్రాజెక్ట్ కింద కొనసాగుతున్న ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనుల దృష్ట్యా ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ఈ కేబీఆర్ పార్క్ చుట్టూ వన్-వే ట్రాఫిక్ విధానాన్ని తీసుకొచ్చారు.

**రెండు పైలట్ ట్రయల్స్ నిర్వహణ**

ఈ వన్-వే విధానాన్ని శాశ్వతంగా అమలు చేయడానికి ముందు రెండు సార్లు పైలట్ ట్రయల్స్‌ను నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

# 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

**ఆగస్టు 15న సంగారెడ్డి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సీఎం రేవంత్ శ్రీకారం**
**రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఏకకాలంలో కార్యక్రమాలు**
**1.06 కోట్ల కార్డులు.. ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల ఉచిత సన్నబియ్యం**
**2025 జనవరి 26 నుంచి కొత్తగా 16.32 లక్షల ఆహార భద్రత కార్డులు**
**ఏర్పాట్లలో ఎక్కడా లోటు ఉండొద్దు**
**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 11:** తెలంగాణలో ఆహార భద్రత వ్యవస్థకు స్మార్ట్ రూపం తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 3.43 కోట్ల మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ఆగస్టు 15న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంతో పాటు 33 జిల్లా కేంద్రాల్లో ఒకేసారి పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రాష్ట్రంలో ప్రస్తుతం 1,06,28,092 ఆహార భద్రత కార్డులు ఉండగా, వాటి ద్వారా 3.43 కోట్ల మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం, లబ్ధిదారుల సౌకర్యం మరింత పెరుగుతుందని మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. 2025 జనవరి 26 నుంచి ఇప్పటివరకు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులు జారీ చేయగా, వాటి ద్వారా 61,08,544 మందికి ఆహార భద్రత కల్పించినట్లు మంత్రి వెల్లడించారు. రేషన్ బియ్యం కోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మరో రూ.20 వేల కోట్ల వరకు ఖర్చు చేస్తోందని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వాస్తవ లబ్ధిదారులను గుర్తించి పారదర్శకంగా కార్డులు అందించాలని సూచించారు. "ప్రతి అర్హుడికీ ఆహార భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేయడమే స్మార్ట్ రేషన్ కార్డుల ఉద్దేశం" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## నిషేధిత భూములపై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందొద్దు

**చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం**
**యుద్ధ ప్రాతిపదికన దరఖాస్తులను పరిష్కరించాలి**
**ఈనెల 14లోగా అన్ని డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేయాలి**
**అర్హులకు అన్యాయం జరుగదు**
**ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ లేదు**
**సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలకు చెక్**
**ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల మేరకే నిర్ణయాలు**
**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**ముద్ర, హైదరాబాద్ :** 22ఎ, పీఓబీ (నిషేధిత ఆస్తుల) జాబితాలో ఉన్న భూముల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన, సాంకేతిక సమస్యలను పరిష్కరించి బాధితులకు ఊరట కల్పిస్తామని మంత్రి స్పష్టం చేశారు. భూముల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ పత్రాలు, లే-అవుట్ అనుమతులు తదితర అన్ని వివరాలను ఈ నెల 14లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆన్‌లైన్‌లో పూర్తి సమాచారం అందుబాటులో ఉంటే నకిలీ పత్రాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు రిజిస్ట్రేషన్ సమయంలో సబ్‌రిజిస్ట్రార్లకు స్పష్టత వస్తుందని తెలిపారు. పహానీలకు కూడా సబ్‌రిజిస్ట్రార్లకు యాక్సెస్ కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

22ఎ, పీఓబీ దరఖాస్తులను కేసుల వారీగా పరిశీలించి, నిజమైన వాటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. అర్హులైన పేదలకు అన్యాయం జరిగేలా ఎవరైనా ఉద్దేశపూర్వకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సబ్‌రిజిస్ట్రార్ల విచక్షణాధికారాలను పరిమితం చేస్తామని, ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల ఆధారంగానే నిర్ణయాలు తీసుకునేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

22ఎ, పీఓబీ అంశంపై హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, సబ్‌రిజిస్ట్రార్లతో సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. సమస్యలు వచ్చిన తర్వాత పరిష్కరించడం కంటే, సమస్యలు రాకుండా చూడటమే కలెక్టర్ల బాధ్యత అని సూచించారు. ఈ రోజు సాయంత్రంలోగా నాలుగు జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్‌లతో సమావేశం నిర్వహించి ఉన్నత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వారికి తెలియజేసి తక్షణం అమలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ శాఖ ఐ.జి. ని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ సెక్రెటరీ డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంత్, ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్ లు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

**- మంత్రి తుమ్మల**




**ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 11:** రానున్న 2026-27 పత్తి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లను సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో సీసీఐ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన పలు కీలక సూచనలు చేశారు.

రైతులకు కనీస మద్దతు ధర పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఈ సీజన్‌లో Long Staple Cottonకు క్వింటాల్‌కు రూ.8,667 MSP ప్రకటించగా, గతేడాదితో పోలిస్తే రూ.557 పెరిగిందన్నారు. రైతులు MSP కంటే తక్కువ ధరకు పత్తిని విక్రయించే పరిస్థితి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు, 25.85 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉన్న నేపథ్యంలో 356 జిన్నింగ్ మిల్లులను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. 15 నుంచి 30 రోజుల వ్యవధిలో అన్ని జిల్లాల్లో మిల్లులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సీసీఐ కొనుగోలు కేంద్రాలను గతేడాది 122 నుంచి ఈసారి 131కి పెంచినట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలోని మానిటరింగ్ కమిటీల్లో రైతు ప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని మంత్రి సూచించారు. మార్కెట్లు, జిన్నింగ్ మిల్లుల వద్ద రద్దీ లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళీకృతం చేయాలని, రైతులకు ముందుగానే స్లాట్లపై సమాచారం అందించాలని సూచించారు. పత్తి నాణ్యత పరీక్షలకు అవసరమైన పరికరాలు, కొనుగోలు కేంద్రాల్లో CCTVలు, తూకం యంత్రాలు తప్పనిసరిగా పనిచేసేలా చూడాలని ఆదేశించారు.రైతుల ఫిర్యాదుల పరిష్కారం కోసం 1800 599 5779 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్, 88972 81111 వాట్సాప్ చాట్‌బాట్ సేవలను వినియోగించుకునేలా విస్తృత ప్రచారం చేయాలని మంత్రి తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు, సీసీఐ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతి రైతుకు MSP ప్రయోజనం అందేలా చూడాలని స్పష్టం చేశారు.

## భుజానికి గాయం.. సర్జరీ చేయించుకోనున్న ఎన్టీఆర్

**ముద్ర, హైదరాబాద్:** ప్రముఖ నటుడు ఎన్టీఆర్‌కు శస్త్రచికిత్స జరగనుంది. ఇటీవల ఆయన భుజానికి గాయమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వైద్యుల సలహా మేరకు ఆయన సర్జరీ చేయించుకోనున్నారు. హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో బుధవారం శస్త్రచికిత్స జరగనుంది. ఈ మేరకు ఆయన కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఎన్టీఆర్ పూర్తి ఆరోగ్యంతో త్వరగా కోలుకునే దిశగా వైద్యుల బృందం చికిత్స అందిస్తోందని పేర్కొంది. సర్జరీ తర్వాత ఆయన ఆరోగ్య పురోగతికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తామని ఎన్టీఆర్ కార్యాలయం తెలిపింది.

## తెలంగాణ మట్టి పరిమళాన్ని తరతరాలకు అందిస్తున్న వారసులు కళాకారులు

**-TUWJ రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ**



**ముద్ర, మల్కాజిగిరి :** తెలంగాణ అంటే కేవలం ఒక భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదని, తెలంగాణ అంటే ఒక జీవన సంస్కృతి... తెలంగాణ అంటే ఆట, పాటల పుట్ట... తెలంగాణ అంటే విభిన్న సంస్కృతుల, సంప్రదాయాల గడ్డ... తెలంగాణ అంటే పల్లె మట్టి పరిమళమని, ఆ మట్టి పరిమళాన్ని తరతరాలకు అందిస్తున్న గొప్ప వారసులు మన జానపద కళాకారులని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అన్నారు. మంగళవారం నాడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, గాజుల రామారంలోని పద్మావతి కన్వెన్షన్ లో, "కలాలు, గలాల వేదిక" నిర్వహించిన బోనాల కళా జాతరకు ఆయన ప్రత్యేక అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రముఖ ప్రజా గాయకుడు దరువు అంజన్న ఈ సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, పుస్తకాల్లో లేని చరిత్రను పాటల ద్వారా ప్రజలకు నేర్పి, వారిని చైతన్య పరిచేవాళ్ళే ప్రజా కళాకారులని, సామాన్యుల జీవితాలను, రైతుల కష్టాలను, కూలీల మహిళల భావాలను, పల్లె జీవనాన్ని తమ కళలో ప్రతిబింబించిన ఘనత కళాకారులకే దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు. కళాకారుడి చేతిలోని డప్పు కేవలం ఒక వాయిద్యం మాత్రమే కాదని, అది ప్రజల గుండె చప్పుడని, అతని గొంతులో వినిపించే పాట కేవలం వినోదం మాత్రమే కాదని, అది సమాజానికి ఒక సందేశం, ఒక చైతన్యమని ఆయన పేర్కొన్నారు. అందుకే కళాకారుడిని కేవలం వినోదం అందించే వ్యక్తిగ కాకుండా, ఒక చరిత్రకారుడిగా, ఒక సామాజిక కార్యకర్తగా, ఒక చైతన్యవంతుడిగా, ప్రజల గొంతుక చూడాలని విరాహత్ అలీ అన్నారు. కళ బతికితే సంస్కృతి బతుకుతుందని, సంస్కృతి బతికితే సమాజం బతుకుతుందని, సమాజం బతికితే మన అస్తిత్వం బతుకుతుందని ఆయన స్పష్టం చేసారు. ఇంకా ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యూజే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు జి. బాల్ రాజ్ గౌడ్ తో పాటు కళాకారులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ప్రజల భాగస్వామ్యంతో పార్ట్ నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్

**రోడ్ డాక్టర్ పేరుతో జీరో పాత్ హోల్ మిషన్**
**ఆర్టీజీఎస్ నుంచి చేపట్టిన వివిధ శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు**

**ముద్ర, అమరావతి :** ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమాన్ని చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమంలో అధికారులు.. ఉద్యోగులు, ప్రజలు అంతా భాగస్వామ్యం కావాలి. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభంగా అందిస్తే జాతి నిర్మాణానికి సహకరించినట్టే. ప్రతి ఉద్యోగి.. ప్రతి అధికారి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు సహకరించాలి. పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. దీన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. రోడ్ డాక్టర్ పేరుతో జీరో పాత్ హోల్ మిషన్ టేకప్ చేయాలి. గుంతలు పడిన రోడ్లను వెంటనే మరమ్మత్తులు చేపట్టేలా చర్యలు చేపట్టాలి. ఇప్పటికే కొన్ని చోట్ల ప్రయోగత్మకంగా చేస్తున్నారు. దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలి. ఎల్ నినో ప్రభావం ఇప్పటి నుంచి ఎక్కువగా ఉండనుంది. ఇప్పుడే అసలు సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. వీటిని అధిగమించాలి."అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## హవానాలో క్యూబా అధ్యక్షుడికి సీపీఐ నేత రామకృష్ణ అభినందనలు



**ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 11:** ఫిడెల్ కాస్ట్రో శతజయంతి వేడుకల సందర్భంగా హవానాలో క్యూబా అధ్యక్షుడు కామ్రేడ్ మిగుయెల్ డియాజ్-కానెల్‌ను భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి కామ్రేడ్ కె. రామకృష్ణ సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఫిడెల్ కాస్ట్రోకు ఘన నివాళులు అర్పించారు. క్యూబా–భారత్ ప్రజల మధ్య స్నేహ, సౌభ్రాతృత్వ సంబంధాలు మరింత బలోపేతం కావాలని రామకృష్ణ ఆకాంక్షించారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను భావితరాలకు చాటిచెప్పాలి

**ఆగస్టు 21న విడుదల కానున్న 'సర్దార్ సర్వాయి పాపన్న' సినిమా ట్రైలర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్**



**ముద్ర, హైదరాబాద్ :** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా ఆగస్టు 21న విడుదల కానున్న 'సర్దార్ సర్వాయి పాపన్న' సినిమా ట్రైలర్‌ను మినిస్టర్ క్వార్టర్స్ లో రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని,పోస్టర్ కూడా చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడు తూ.. బహుజన రాజ్యాన్ని స్థాపించి, మన ప్రాంతాన్ని మనమే పరిపాలించుకోవాలనే ఆలోచనతో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం సాగించారని అన్నారు. గోల్కొండను వేదికగా చేసుకొని బహుజన రాజ్యాన్ని స్థాపించేందుకు ఆయన కృషి చేశారని తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం అభినందనీయమని మంత్రి తెలిపారు. పాపన్న గౌడ్ చరిత్రను వెండితెరపై ఆవిష్కరిస్తున్న చిత్ర యూనిట్‌కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు పతాని రామకృష్ణ, దర్శకుడు, నిర్మాత లింగంపల్లి వెంకటేష్ గౌడ్, డిస్ట్రిబ్యూటర్ పేపర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 11.08.2026
www.mudranews.in
@mudranews
mudratv



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

### మోదీని ఓడించాలంటే
# అదే మార్గం!
**యుద్ధం వద్దని పాకిస్తాన్‌ను వేడుకుంటున్న విపక్షాలు**

భారత రాజకీయాల్లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అవ్వడం చాలా మందికి ఊహించలేని విషయంగా కనిపించింది. యూపీఏ ప్రభుత్వం కొనసాగుతున్న సమయంలో బీజేపీకి మద్దతు ఇచ్చిన కొన్ని పార్టీలు కూడా వేరే దిశగా మళ్లాయి. అయినప్పటికీ 2014 లోక్‌సభ ఎన్నికలు బీజేపీకి ఒంటరిగా మెజారిటీ సాధించే అవకాశం కల్పించాయి. ఇది జాతీయ స్థాయిలో నాయకత్వం, ప్రచార వ్యూహం, ప్రజల అసంతృప్తి బీజేపీకి ప్లస్ అయ్యాయి.

**2014 నుంచి 2019 వరకు..**

2014లో బీజేపీ ఘన విజయం సాధించి మోదీ ప్రధానమంత్రి అయ్యారు. ఆ తర్వాత 2019 ఎన్నికలకు ముందు ఇక 2019 నాటికి మోదీ పని అయిపోయింది అని అనుకున్నారు. అన్ని పత్రికలు కథనాలు కూడా రాశాయి. 2019 ఎన్నికలకు ముందే పుల్వామా ఘటన జరిగింది. కశ్మీర్‌లో ఉగ్రవాదులు బహిరంగంగా హెచ్చరిక చేశారు. పాకిస్తాన్‌లో కూర్చుని ప్రకటనలు ఇచ్చారు. లష్కర్ ఎ తోయిబా, హిజ్‌బుల్ ముజాహిద్దీన్ అధినేత మోదీకి మా దెబ్బ చూపించాం ఇక అయిపోయాడు అని ప్రకటించారు. భారత దేశంలో ఉగ్రదాడి చేస్తే భారతీయులే మోదీని ఓడించబోతున్నారని ప్రకటించారు. కానీ సర్జికల్ స్ట్రైక్ 2, బాలాకోట్ ఎటాక్ ఇంపాక్ట్ తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. 2019 ఎన్నికల్లో 303 సీట్ల బంపర్ మెజారిటీతో కేంద్రంలో బీజేపీ మరోమారు అధికారంలోకి వచ్చింది.



**విపక్షాల డీప్ స్టేట్ ఎత్తుగడలు..**

అప్పటి నుంచే డీప్ స్టేట్ ప్లానింగ్ దేశంలోని ఇండియా కూటమి, ఆప్, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, బీఎస్పీ తప్ప మిగతా అందరూ కలిసిపోయారు. ఇందుకు డీప్ స్టేట్ అమెరికా నుంచి తెరవెనుక నడిపించింది. చైనా నుంచి మద్దతుతో కమ్యూనిస్టులు కూడా అందులో దూరారు. దీంతో 2024 ఎన్నికల్లో బీజేపీ కాస్త వెనక్కు తగ్గేలా చేశారు. సీట్లు తగ్గించారు. అయితే ఈ విషయం ముందే పసిగట్టిన బీజేపీ కర్ణాటకలో జేడీఎస్‌తో, ఏపీలో టీడీపీ, జనసేనతో చివరి నిమిషంలో పొత్తు పెట్టుకుంది. దీంతో 2024 ఎన్నికల్లోనూ మళ్లీ గెలిచి అధికారంలోకి వచ్చింది. వరుసగా మూడోసారి మోదీ ప్రధాని అయ్యారు.

**యుద్ధానికి సిద్ధమవుతున్న పాకిస్తాన్..**

పాకిస్తాన్‌లో అంతర్గత అస్థిరత, ఉద్యమాలు, హింసాత్మక సంఘటనలు కొనసాగుతున్న నేపథ్యంలో, సరిహద్దు సమస్యలు భారత రాజకీయాలపై ప్రభావం చూపగలవు. గతంలో పుల్వామా వంటి సంఘటనలు, తర్వాతి సైనిక చర్యలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేశాయి. ఇటీవలి సంఘటనలు (పహల్గామ్ వంటివి) వాటికి ప్రతిస్పందనలు ప్రజల్లో భద్రతా అవగాహనను పెంచాయని చాలా మంది గమనిస్తున్నారు. ఒకవేళ సరిహద్దు ఉద్రిక్తతలు పెరిగితే, అవి రాజకీయ చర్చను భద్రతా అంశాల వైపు మళ్లించగలవు. దీంతో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందన్న ఆందోళన విపక్షాల్లో నెలకొంది.

**యుద్ధం జరగొద్దని..**

ఇప్పుడు 2029 ఎన్నికల వైపు చూస్తే, విపక్షాలు వివిధ మార్గాలు అన్వేషిస్తున్నాయి. ఆప్ నాయకత్వం యువ నాయకులను ముందుకు తీసుకురావడం, రాహుల్ గాంధీ యువతరం మద్దతు గురించి ప్రచారం చేయడం వంటివి కనిపిస్తున్నాయి. అయితే ఈ వ్యూహాలు ఎంతవరకు ఓటర్ల మనసులను మారుస్తాయనేది ఇంకా స్పష్టం కాలేదు. మరోవైపు మోదీని ఓడించాలంటే పాకిస్తాన్ భారత్‌తో యుద్ధం చేయొద్దని కోరుకుంటున్నారు. యుద్ధం జరిగితే 2029లోనూ బీజేపీకి తిరుగు ఉండదని భావిస్తున్నారు.

బీజేపీ నాయకత్వం 2014 నుంచి 2024 వరకు ఎన్నికల్లో బలంగా నిలిచింది. భవిష్యత్తులో కూడా ఎన్నికల ఫలితాలు కేవలం ఒకే అంశం లేదా ఒకే వ్యూహంతో కాకుండా, ప్రజల అనుభవాలు, పాలనా ఫలితాలు, బాహ్య సవాళ్లు, ప్రత్యర్థుల సమన్వయం వంటి అనేక కారకాల మీద ఆధారపడి ఉంటాయి.

- నరేష్, ముద్ర

### తిరుమలలో రూ.900 కోట్ల పనులకు
# బ్రహ్మోత్సవ ముహూర్తం



శ్రీవేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను సెప్టెంబరు 15 నుంచి వైభవంగా నిర్వహించేందుకు తితిదే సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున మొదటి రోజు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా తిరుమలలో భారీగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయించనుంది. రూ.900 కోట్లకు పైగా విలువైన పనులు సకాలంలో పూర్తి చేయించేలా తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్యచౌదరి పర్యవేక్షిస్తున్నారు.

# కనకవర్షం..!!



కాంచీపురంలో కామాక్షీ దేవిగా కొలువుదీరిన పార్వతీదేవికి తన ప్రథమ పుత్రుడైన వినాయకుడంటే అమితమైన ప్రేమ, మమకారం. ప్రాచీనకాలంలో ఈ కాంచీపురాన్ని మొదటగా పాలించినది ఆకాశభూపతి అనే రాజరాజన్, ఆయన కామాక్షీదేవికి భక్తుడు.

సదా దేవి చరణములే శరణాగతియని నమ్మినవాడు. ఆ రాజు భక్తికి మెచ్చిన దేవి తన ప్రథమ పుత్రుడైన వినాయకుని ఆ రాజుకు వరప్రసాదంగా ఇచ్చింది.

అంబ వినాయకుని రాజరాజన్ కు పుత్రునిగా జన్మించమని ఆదేశించింది. తల్లి ఆజ్ఞను శిరసావహించి వినాయకుడు ఆకాశభూపతికి పుత్రుడై జన్మించాడు.

నామకరణోత్సవం రోజున కాంచీపురం ఉత్సాహభరితంగా కోలహలంతో ఆనందం వెల్లివిరిసింది. ఆ ఉత్సవంలో ముఖ్యభాగంగా సుమంగళి పూజ జరిగింది.

సుమంగళులకు వడ్డించవలసిన పిండివంటలన్నిటి భాధ్యతని ఆకాశభూపతి భార్య చేపట్టింది. వంటల పర్యవేక్షణకై ఆ మహారాణి వంటశాలలోకి ప్రవేశించినది.

భోజనాలు చేయబోయే సుమంగళులంతా సాక్షాత్తు కామాక్షీదేవి స్వరూపమని అందువలన వంటకాల విషయంలో ఏ కొరత వుండకూడదని రాణి ఆదేశించింది.

తయారౌతున్న ప్రతీ వంటకాన్ని స్వయంగా దగ్గరుండో పర్యవేక్షించింది. తన చేతితో వండి వాటి నాణ్యతను పరిశీలించి చూసింది. ఆ సమయంలో రాణీగారి చేతి ఉంగరంలో. నుండి ఒక బంగారు మువ్వ రాలి ఆ వంటలలో కలసిపోయింది.

ఇది ఎవరూ గమనించలేదు. సుమంగళి పూజ అయిపోగానే ఆకాశ భూపతి స్వయంగా సుమంగళులందరికి వడ్డించసాగాడు. ఆ సమూహం మధ్యలో ఒక ముత్తైదువు తనకు బాగా తెలిసిన స్త్రీవలె గోచరించింది.

తేజస్సు వుట్టిపడే ఆ వదనాన్ని రెప్ప వేయకుండా కొన్ని క్షణాలపాటు చూస్తూ వుండిపోయాడు. అది గమనించిన ఆ స్త్రీ మూర్తి నర్మగర్భితంగా నవ్వుతూ ఆకులో వడ్డించిన ఒక మోదాకాన్ని తీసి నోటిలో వేసుకుంది.

భూపతి రాజుకు ఆ స్త్రీ మూర్తి ఎవరో తెలుసుకోవలనే తహతహ ఎక్కువైనది. ఆలోచిస్తూనే సుమంగళి పూజలు కొనసాగించాడు.

హఠాత్తుగా గర్భగుడిలో వున్న కామాక్షీ దేవి ముఖారవిందం, పంక్తిలో భోజనం చేస్తున్న ఆ ముత్తైదువ వదనం ఒకలాగే వుండడాన్ని రాజు మనసు గమనించింది. అదిరిపాటుతో భూపతి చేతిలోని పూజా సామాగ్రి వదలి వేసి, అంబిక వున్న పంక్తి వైపు పరిగెట్టాడు. అక్కడ అంబిక కనిపించలేదు.

కాని భవనానికి వెలుపల పెద్దగా వానపడుతున్న శబ్దం వినబడినది. కానీ పడుతున్నది వాన కాదు. బంగారు కాసులు వర్షిస్తున్నవి. మహారాణి చేతినుండి రాలి పడిన బంగారు మువ్వ మోదకంలో కలసిపోయింది.

ఆ మోదకం సరిగ్గా అంబిక భుజించే ఆకులోనే పడింది. ఆ బంగారు మువ్వ కలసిన మోదకాన్ని అంబిక ఆరగించగానే కాంచీపురం సహా తొండైమండలం అంతా అమ్మవారి కరుణాకటాక్షాలతో బంగారం వానగా కురిసింది.

భక్తి శ్రధ్ధలు కలిగి పవిత్రమైన హృదయంతో తనను ధ్యానించే తన భక్తుడైన ఆకాశ భూపతికి (తల్లి మాట జవదాటకుండా భూలోకంలో జన్మించిన గణేశుని అనుగ్రహించడానికి) ఊరంతా బంగారు వాన కురిపించింది కామాక్షీ.

దీనికి కృతజ్ఞతగా ఈనాటికి భూలోకంలో జన్మించిన వినాయకుడు శిలారూపంతో తుండీర మహారాజు అనే పేరుతో కామేశ్వరీదేవిని పూజిస్తూనే వున్నాడు.

(కాంచిపురం వెళ్ళిన వారు దర్శించాల్సిన శిల్పం)

వినాయకుడు తుణ్డీరన్ అనే పేరుతో కాంచీ పురాన్ని పరిపాలించినందున కాంచీపురానికి తుణ్డీర నాడు అనే పేరు వచ్చినట్లు వినాయక పురాణంలో వున్నది.

అమ్మవారి కరుణతో మాట వచ్చి అమృతతుల్యమైన కవిత్వాన్ని ఆశువుగా చెప్పిన మూకర్ అనే కవి "తుణ్డీరాఖ్యే మహతి విషయే స్వర్ణవృష్టి ప్రధాత్రీ" అని "మూక పంచతి స్తుతి" శతకంలో ఆరంభ శ్లోకంగా వర్ణించారు.

ఈ సంఘటన జరిగిన చాలాకాలం తర్వాత శ్రీరామభక్తుడైన త్యాగరాజస్వామి వారు కాంచీపురానికి విజయం చేశారు. ఆయన చెవులకి యీ చరిత్ర వినబడింది.

ఆయన నేత్రాల నుండి ఆనందబాష్పాలు ధారగా వర్షించాయి. కామేశ్వరి సన్నిధికి శరవేగంగా వెళ్ళారు. అక్కడ కామాక్షి దేవి సౌందర్యరాశిగా, కరుణాసాగరిగా దర్శనం కటాక్షించింది.

భక్తశిఖామణియైన త్యాగరాజస్వామి వారికి అమ్మవారిపట్ల కోపం కలిగింది. జగదంబ కేవలం వినాయకునికి మాత్రమే కాదు లోకమంతటికి కన్న తల్లి. మన అందరికి కన్నతల్లి.

ఆమెకు తన బిడ్డలపట్ల పక్షపాత వైఖరి తగునా అని వాపోయారు. తన పుత్రుడు జన్మించిన ప్రాంతాన బంగారు వర్షం కురిపించి మిగిలిన సుతులను అలక్ష్యానికి గురిచేయడం ఏమి న్యాయం?

అందుకే తన మాతృదేవతగా భావించిన అంబిక మీద త్యాగరాజస్వామి కి ప్రేమతో కూడిన అలక లాటి కోపం వచ్చింది. వెంటనే అక్కడ రెండు కీర్తనలు వ్రాసారు. "వినాయకుని" అనే కీర్తన.

"గిరిరాజ సుత తనయా" అనే మరో కీర్తనలో "అంబికయిన్ కుమారనే" అని వినాయకుని సంబోధిస్తూ అమ్మవారిని స్తుతించారు.



# 21 పెద్దల కోసం సూత్రాలు

వయసు పెరిగే కొద్దీ మన ఆరోగ్యంతో పాటు మనసుకు ప్రశాంతత కూడా ఎంతో అవసరం. పెద్దల జీవితాన్ని సంతోషంగా, ఆరోగ్యంగా, టెన్షన్ లేకుండా ఉంచేందుకు ఈ 21 సూత్రాలను పాటిద్దాం.



**సంతోషమే సగం బలం**

ఎప్పుడూ ఆనందంగా ఉండేందుకు ప్రయత్నించండి. చిన్న చిన్న విషయాల్లోనూ సంతోషాన్ని వెతుక్కోండి



**ధ్యానం చేయండి**

అందుబాటులో ధ్యాన కేంద్రాలు ఉంటే వెళ్లండి. లేకపోతే ఇంట్లోనే కొంత సమయం ప్రశాంతంగా ధ్యానం చేయండి.

**దుష్టచతుష్టయాన్ని వదలాలి**

కోపం, ద్వేషం, ఆవేశం, అహంకారం—ఈ నాలుగింటినీ మనసు నుంచి దూరం చేయండి.

**స్వీట్ & సాల్ట్ తగ్గించండి**

చక్కెర, ఉప్పు అధికంగా తీసుకోవడం తగ్గించండి. ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వండి.

**ఆధ్యాత్మికతను పెంచుకోండి**

ఇంటి ఇలవేలుపు, ఇష్టదైవం లేదా మీ ఆధ్యాత్మిక విశ్వాసంపై నమ్మకం మనసుకు ధైర్యాన్ని ఇస్తుంది.

**నీరు తగినంత తాగండి**

శరీరానికి అవసరమైనంత నీరు తీసుకోండి. అయితే కిడ్నీ/హార్ట్ సమస్యలు ఉన్నవారు వైద్యుల సూచన మేరకు నీరు తీసుకోవాలి.

**వ్యాయామం చేయండి**

వాకింగ్, సైక్లింగ్ లేదా మీకు అనుకూలమైన వ్యాయామం క్రమం తప్పకుండా చేయండి.

**ఎక్కువసేపు కూర్చోవద్దు**

సాధ్యమైనంత వరకు తరచూ కదలండి. ఎక్కువసేపు కూర్చునే అలవాటును తగ్గించండి.



**జీవించడానికి తినండి**

తినడానికి జీవించకండి. పిండి పదార్థాలు పరిమితంగా తీసుకుంటూ, కూరగాయలు, పప్పులు, తగినంత ప్రోటీన్, పండ్లు వంటి పోషకాహారానికి ప్రాధాన్యత ఇవ్వండి.

**టీ, కాఫీ పరిమితం**

అలవాటు ఉంటే పరిమితంగా తీసుకోండి. అధిక చక్కెర కలపకుండా తీసుకోవడం మంచిది.

**మోహాలు, వ్యామోహాలు వద్దు**

అనవసరమైన ఆశలు, పట్టుదలలు, ఆందోళనలను తగ్గించుకుని ప్రశాంతంగా జీవించండి.

**ప్రయాణాలు చేయండి**

ఆరోగ్యం సహకరించినంత వరకు సంవత్సరానికి ఒకటి రెండు సార్లు కుటుంబంతో లేదా స్నేహితులతో యాత్రలకు వెళ్లండి. ప్రకృతిని ఆస్వాదించండి.

**విమర్శలు, ద్వేషాలు వద్దు**

ఎవరినీ అనవసరంగా విమర్శించకండి. మనసులో ద్వేషాన్ని పెట్టుకోకండి.

**పిల్లల జీవితాల్లో జోక్యం వద్దు**

పిల్లలు పెద్దవాళ్లయ్యారు కాబట్టి వారి నిర్ణయాలను గౌరవించండి. అడిగినప్పుడు మాత్రమే సలహా, సూచనలు ఇవ్వండి.

**బిగుతు దుస్తులు తగ్గించండి**

శరీరానికి సౌకర్యంగా ఉండే, గాలి తగిలే దుస్తులు ధరించండి.

**హాబీలను పెంచుకోండి**

మీకు ఇష్టమైన అభిరుచులను కొనసాగించండి. పుస్తకాలు చదవడం, సంగీతం వినడం, తోటపని, పజిల్స్, సుడోకు, క్రాస్‌వర్డ్ వంటి మెదడుకు పదును పెట్టే కార్యక్రమాలు చేయండి.



**హెల్త్ చెకప్స్ అవసరం**

వయసుకు, ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా వైద్యుల సూచన మేరకు పరీక్షలు చేయించుకోండి. మందులు కూడా వైద్యుల సలహా మేరకే తీసుకోండి.

**మంచి పుస్తకాలు చదవండి**

మనసుకు నచ్చిన పుస్తకాలను చదవండి. మంచి ఆలోచనలు, జ్ఞానం, సానుకూల దృక్పథం పెంచుకోండి.

**మెట్ల విషయంలో జాగ్రత్త**

బ్యాలెన్స్ సమస్య ఉంటే లేదా వయసు కారణంగా పడిపోయే ప్రమాదం ఉంటే సపోర్ట్ లేకుండా మెట్లు ఎక్కడం, దిగడం చేయవద్దు. అవసరమైతే ఎస్కలేటర్‌కు బదులుగా సురక్షిత మార్గాన్ని ఎంచుకోండి.

**మధుర స్మృతులు పంచుకోండి**

పాత మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ మీ వయసువారితో, స్నేహితులతో పంచుకోండి. నవ్వుతూ మాట్లాడండి.

**పాజిటివ్‌గా ఉండండి**

గతాన్ని మార్చలేం. భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియదు. అందుకే ఈరోజును ఆనందంగా, ప్రశాంతంగా జీవించండి.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 12.08.2026
www.mudranews.in | @mudranews



## పాముకాటు నోటితో విషం పీల్చొద్దు



సినిమాల్లో చూపించి నట్లుగా కాటు వద్ద నోరు పెట్టి విషాన్ని పీల్చి ఉమ్మేయడం సరైన ప్రథమ చికిత్స కాదు. విషాన్ని పూర్తిగా బయటకు తీయడం సాధ్యం కాదు. పైగా నోటిలో గాయాలు లేదా పుండ్లు ఉంటే విషపూరిత పదార్థం మరో వ్యక్తికి ప్రమాదం కలిగించే అవకాశం ఉంటుంది.

## వైభవంగా స్వామివారి నిత్య కళ్యాణం



విశ్వేశ్వరుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు మంగళవారం శ్రీ స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. సాయంత్రం ఆదిమధ్యాం తరహితుడైన స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను నిర్వహించారు. - ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

## హర్ ఘర్ తిరంగా విజయవంతం చేయాలి



**ముద్ర, దేవరకొండ:** ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు, కొండమల్లేపల్లి మండల ఇన్‌చార్జి పోతేపాక సాంబయ్య పిలుపునిచ్చారు.కొండమల్లేపల్లి మండల బీజేపీ పదాధికారుల సమావేశం పెండ్లిపాకలలో మండల అధ్యక్షుడు భూతరాజు భరత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ దేశభక్తి, జాతీయ సమైక్యతా భావాన్ని ప్రజల్లో పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.మండలంలోని రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, రైతుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని సాంబయ్య విమర్శించారు. రైతులు, యువత, మహిళలు, పేదలు, నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో సున్నప్రోలు పద్మావతి, బొడ్డు యాదయ్య, నెల్లికంటి గోపి, లింగస్వామి, వశ్య నాయక్, విజయ్, తారయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### ఎస్పీ అక్షాన్ష్ యాదవ్



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ అన్నారు. మంగళవారం జిల్లా డీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్ఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నమోదైన వివిధ నేర కేసుల దర్యాప్తు, పురోగతిపై ఎస్పీ సమగ్రంగా సమీక్షించారు. పోక్సో కేసులు, ముఖ్యంగా పోక్సో సైబర్ టిప్‌లైన్ కేసులను సకాలంలో దర్యాప్తు పూర్తి చేసి పరిష్కరించాలని సూచించారు. అలాగే ఎన్ డి పి సి , ఎస్ సీ /ఎస్ టి , లాంగ్ పెండింగ్ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు.స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలకు సంబంధించిన డిస్పోజల్ కేసుల్లో నిబంధనల ప్రకారం ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్‌స్టేషన్లకు వచ్చే పిటిషనర్లను ఎస్‌హెచ్ఓలు తప్పనిసరిగా వ్యక్తిగతంగా కలిసి వారి సమస్యలను తెలుసుకుని, ప్రతి ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.రాబోయే పండుగల నేపథ్యంలో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో పోలీసులు క్రమం తప్పకుండా పర్యటించాలని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.నేరాల నియంత్రణ, ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారం, కేసుల వేగవంతమైన దర్యాప్తు, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని ఎస్పీ స్పష్టం చేశారు.

## దేశ భవిష్యత్ యువతపై ఉంది

### ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ కల్వకూరి ప్రభు కుమార్



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** దేశ భవిష్యత్ యువత పై ఉందని ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ కల్వకూరి ప్రభు కుమార్ అన్నారు. "రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్" ప్రారంభించి 100 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా దేశం అంతా హిందూ యువ సమ్మేళనం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం భువనగిరి జిల్లా కేంద్రంలో రావి భద్రరెడ్డి ఫంక్షన్ హాల్ లో జరిగిన హిందూ యువ సమ్మేళనంలో మాట్లాడుతూ దేశ భవిష్యత్ ఈ దేశ నవ యువత పై ఉందని, స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన వీరులను స్పూర్తిగా తీసుకొని దేశ సమైక్యతను దేశ సంస్కృతిని హిందుత్వాన్ని పరిరక్షించడానికి నడుము బిగించాలని యువతకు సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నల్లగొండ విభాగ ప్రచారక్ కాసం సత్యనారాయణ, ఆర్ఎస్ఎస్ నల్లగొండ విభాగ్ సహకార్యవాహ తాడెం పాండు, ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచలక్ బాదం ప్రకాష్, జగిలాపురం నాగరాజు, ఆలెడీ గణేష్, ఆడేపు పాండు, ముదం కమలాకర్, మెరుగు మహేష్, ఏబీవీపీ, బజరంగ్దళ్, హిందు వాహిని కార్యకర్తలు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటి పెరట్లో విరబూసిన అరుదైన బ్రహ్మకమలం



**ముద్ర, దేవరకొండ :** హిమాలయ ప్రాంతాల్లో అరుదుగా కనిపించే పుష్పంగా బ్రహ్మ కమలానికి ప్రత్యేక గుర్తింపు ఉందని సీనియర్ పాత్రికేయులు, టీయూడబ్ల్యూజేఐజేయు దేవరకొండ డివిజన్ అధ్యక్షులు గాదె గిరిధర్ రావు అన్నారు. తమ ఇంట్లో ఎంతో ఇష్టం భక్తితో ఇంటి పెరట్లో పెంచుతున్న మొక్కకు అరుదైన బ్రహ్మకమలం పుష్పం విరబూయడంతో వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. తెల్లని రేకులతో ఆకర్షణీయమైన ఆకృతిలో వికసించిన ఈ పుష్పం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. సాధారణ పూలకు భిన్నంగా బ్రహ్మకమలం రాత్రి వేళ వికసించడం దీని ప్రత్యేకత అని వికసించిన సమయంలో ఆహ్లాదకరమైన పరిమళాన్ని వెదజల్లడంతో పాటు పుష్పం కొద్దిసేపు మాత్రమే పూర్తిగా వికసించి అనంతరం వాడిపోవడం వల్ల దీనిని చూసేందుకు చాలామంది ఆసక్తి చూపుతారు.

## 13న ప్రజా చైతన్య యాత్ర ముగింపు సభ

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా జిల్లాలో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్ర ముగింపు సభను ఈనెల 13న ఖమ్మంలో నిర్వహించనున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి ఎస్కే జానిమియా తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ, కాంగ్రెస్ ఎన్నికల హామీల అమలును డిమాండ్ చేస్తూ 20 మండలాల్లో చైతన్య యాత్ర నిర్వహించినట్లు చెప్పారు.ఖమ్మం రోటరీనగర్, అల్లిపురం క్రాస్‌రోడ్డు, నయాబజార్ కళాశాల నుంచి భారీ ప్రదర్శనలు ప్రారంభమై జెడ్పీ సెంటర్‌కు చేరుకుంటాయని తెలిపారు. అనంతరం మహా ప్రదర్శనగా భక్తరామదాసు కళాక్షేత్రానికి చేరుకుని ముగింపు సభ నిర్వహిస్తామన్నారు.సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ తదితరులు హాజరవుతారని తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని జానిమియా కోరారు.

## చేయూత కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

### ఆగస్టు 31 వరకు అవకాశం.. అర్హత ప్రమాణాల్లో మార్పు లేదు

**ముద్ర, హైదరాబాద్:** అర్హులైన పేదలు, బలహీన వర్గాలకు సామాజిక భద్రత కల్పించేందుకు చేయూత సామాజిక భద్రత పింఛన్ పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను ఆగస్టు 31, 2026 వరకు స్వీకరించనున్నారు.తొలిదశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్, హీమోఫీలియా వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి పింఛన్లు మంజూరు చేయనున్నారు. అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు చేయలేదని, 2014–2018 మధ్య జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల్లోని నిబంధనల ప్రకారమే అర్హతను పరిశీలిస్తామని ప్రభుత్వం తెలిపింది.ప్రజా పాలన వారోత్సవాలు, 99 రోజుల ప్రగతి ప్రణాళిక గ్రామసభలు, ప్రజావాణిలో ఇప్పటికే దరఖాస్తు చేసి అవసరమైన పత్రాలు సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. పత్రాలు సమర్పించని వారు, ఇప్పటి వరకు దరఖాస్తు చేయని అర్హులు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు.వితంతువులకు భర్త మరణ ధ్రువపత్రం, ఒంటరి మహిళలకు సెపరేషన్ లేదా స్థానిక విచారణ నివేదిక, గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ, చేనేత కార్మికులకు చేనేత–జౌళి శాఖ, ఫైలేరియా బాధితులకు వైద్య ఆరోగ్య శాఖ ధ్రువీకరణ అవసరం. దరఖాస్తుల పరిశీలన అనంతరం క్షేత్రస్థాయిలో అర్హతను తనిఖీ చేసి, జిల్లా కలెక్టర్ ఆమోదంతో పింఛన్ మంజూరు చేస్తారు.అర్హులందరికీ దరఖాస్తు ప్రక్రియలో సహకరించాలని స్వయం సహాయక సంఘాల సమాఖ్యలకు కూడా బాధ్యతలు అప్పగించారు. దరఖాస్తులతో పాటు వివరాలను చేయూత పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను చేపట్టనున్నారు.

## ఆర్థిక వ్యవస్థను బీజేపీ ధ్వంసం చేసింది




**ముద్ర, దేవరకొండ:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి విమర్శించారు. సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా మంగళవారం కొండమల్లేపల్లిలో నిర్వహించిన ప్రచార జాతాలో ఆయన పాల్గొని మాట్లాడారు.బీజేపీ అధికారంలోకి వస్తే నిత్యావసర ధరలను తగ్గిస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపించారు. సెప్టెంబర్ 1న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తూము బుచ్చిరెడ్డి, ఆర్. అంజయ్యనాయక్, పల్లె నరసింహ, జి. వెంకటేశ్వరరెడ్డి, శేఖరాచారి, సోమ్లానాయక్ పాల్గొన్నారు.

## కష్టపడి చదివి.. కలలను నిజం చేసుకోండి

### కేజీబీవీ విద్యార్థులతో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

**ముద్ర, సూర్యాపేట:** విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం ఆత్మకూరు(ఎస్) కేజీబీవీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులతో ముచ్చటించి వారి చదువు, భోజన నాణ్యతపై ఆరా తీశారు. చదువుతో పాటు పౌష్టికాహారం కూడా ఎంతో అవసరమని, భోజనం నాణ్యతను నిరంతరం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థులను "పెద్దయ్యాక ఏమవుతారు?" అని అడగగా పలువురు డాక్టర్, ఇంజనీర్, కలెక్టర్ అవుతామని ఉత్సాహంగా సమాధానమిచ్చారు. వారి ఆత్మవిశ్వాసాన్ని అభినందించిన కలెక్టర్.. సొంత కాళ్లపై నిలబడాలంటే చదువే ప్రధాన మార్గమని, కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి విశాల్, తహసీల్దార్ అమిన్‌సింగ్, ప్రిన్సిపాల్ సరస్వతి పాల్గొన్నారు.

## రేషనలైజ్డ్ ప్రతిపాదనలపై సమావేశం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జిల్లాలో రేషనలైజ్ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి పంపించేందుకు చేపట్టిన ప్రక్రియలో భాగంగా, సైట్ గడువు సమయం ముగిసిన నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి మంగళవారం నిర్వహించారు. భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 257 ఎక్సిస్టింగ్ పోలింగ్ కేంద్రాలు ఉండగా అదనంగా 5 , ఆలేరు నియోజకవర్గానికి సంబంధించి 309 ఎక్సిస్టింగ్ పోలింగ్ కేంద్రాలు ఉండగా అదనంగా 4, మొత్తం పోలింగ్ స్టేషన్స్ రేష్మలైజేషన్ చేసిన తరువాత 575 అయ్యాయని వివరించారు. మార్పులు, విలీనాలు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు విషయంలో ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు.ఈ సమావేశంలో ఆర్డీవో కృష్ణారెడ్డి, అధికారులు, వివిధ రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పెద్దమ్మగుడి రంగులకై పల్లెపాటి నాగరాజు 10వేలు ఆర్థికసాయం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణం లో ఈనెల 22,23 తేదీల్లో నిర్వహించే బోనాల పండుగ పురస్కరించుకొని కిసాన్ నగర్ లోని పెద్దమ్మ గుడి కి రంగుల కోసం పల్లెపాటి నాగరాజు రూ. 10వేలు ఆర్థిక సహాయాన్ని మంగళవారం ముదిరాజ్ బోనాల ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పల్లేపాటి నాగరాజు మాట్లాడుతూ భవిష్యత్తులో నిర్వహించే దేవాలయ పునఃనిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. బోనాల పండుగ ని పట్టణంలోని ముదిరాజులంతా సామూహికంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కుక్కదూగు సోమయ్య, దేవాలయ అభివృద్ధి కమిటీ జిల్లా అధ్యక్షులు తుపాకుల శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్ కొలుపుల వివేకానంద, ముదిరాజ్ సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి నీల శ్రీనివాస్, ముదిరాజ్ బోనాల ఉత్సవ కమిటీ కన్వీనర్ గుర్రాల శివనాగేందర్ పాల్గొన్నారు.

## గొట్టిపర్తిని మండల కేంద్రం చేయాలి



**ముద్ర, తుంగతుర్తి:** గొట్టిపర్తిని నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని బహుజన ప్రజా సమితి (బీపీఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం చేపట్టనున్నట్లు బీపీఎస్ అధ్యక్షుడు అడ్వకేట్ చింతకుంట్ల హరిబాబు తెలిపారు.గొట్టిపర్తి మండల కేంద్రంగా ఏర్పాటైతే పరిసర గ్రామాల ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువవుతాయని, ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రి, పోలీస్‌స్టేషన్, విద్యాసంస్థలు ఏర్పాటై ప్రాంతీయ అభివృద్ధి వేగవంతమవుతుందని అన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు స్థానికంగానే లభించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.బుధవారం అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించే కార్యక్రమానికి ప్రజలు, యువత, రైతులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

## నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** వర్షాభావంతో రాష్ట్రంలో నష్టపోయిన రైతాంగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాల ఆదుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం, అఖిలభారత ప్రగతి వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీ ల ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి కి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి బందెల వెంకయ్య, ఏ యూ కే ఎస్ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి పాశం అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్లో వర్షాలు సజావుగా సకాలంలో ఉంటాయన్న వాతావరణ నిపుణుల మాటలతో ప్రజలంతా వ్యవసాయ సాగుకు సిద్ధపడ్డారు విత్తనాలు వేశారు అక్కడక్కడ చిరుజల్లులు తప్ప భారీ వర్షాలు లేక రైతాంగమంతా తీవ్ర నష్టపోయిందిని, వేసిన పంట మొలకెత్తిన విత్తనాలు ఎండిపోయే దశలో తీవ్ర విషాదంలో రైతాంగం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావంతో నష్టపోయిన రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ముఖ్యంగా తిరిగి ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఉపయోగపడే స్వల్పకాలిక పంటలకు విత్తనాలు ,ఎరువులు ఉచితంగా సకాలంలో క్షేత్రస్థాయిలో అందించాలని డిమాండ్ చేశారు. రైతుల రుణాలు పూర్తిగా రద్దుచేసి ఒకేసారి రుణమాఫీ చేయాలని, కొత్తగా వడ్డీ లేని పంట రుణాలు ఇవ్వాలని, పంటకు బీమా అమలు చేయాలని కోరారు. పశుగ్రాసం, రాబోయే రోజులలో మంచినీటి సరఫరా గ్రామాలకు సమకూర్చాలని సూచించారు. ఎల్ ని నో వలన ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అడు గంటుతున్నాయని, ప్రాజెక్టులు కుంటలు చెరువులోకి నీరు చేరని పరిస్థితి నెలకొందని అన్నారు. వ్యవసాయ కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని రోజుకు 600 రూపాయలు చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ కూలీలకు నెలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించిన విధంగా 1000 జీవన భృతి, కరువు బత్యం ప్రతి కుటుంబానికి 20 కేజీల బియ్యం .7500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రేపాకుల శివలింగం, జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు, కే వెంకటేశ్వర్లు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, రెంటాల యాదగిరి, కూరాకుల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో పెండింగ్ ప్రాజెక్ట్ లపై ప్రజా ఉద్యమం

**29,30,31 తేదీల్లో భువనగిరి నుంచి హైదరాబాద్ పాదయాత్ర**

**31న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద సీపీఎం మహాధర్నా**

**జిల్లా కార్యదర్శి యండి జహంగీర్**




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లా సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించడంలో గత, ప్రస్తుత పాలకులు పూర్తిగా విఫలమయ్యారని వాటి పరిష్కారం కోసం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి యండి జహంగీర్ తెలిపారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్, భువనగిరిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కీలక ప్రాజెక్టులుగా ఉన్న బస్వాపురం ప్రాజెక్టు, గంధమల్ల ప్రాజెక్టు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు, నవాబ్ పేట రిజర్వాయర్ ప్రాజెక్టు, చిన్న నీటి పారుదల కాలువలైన ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి, బునాదిగాని, ఆసిఫ్ నహర్ కాలువ పునరుద్ధరణ పనులు పూర్తి చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29, 30, 31తేదీలలో సీపీఎం చలో హైదరాబాద్ పేరిట రైతులు, నిర్వాసితులు,ప్రజలతో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 29న యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుండి పాదయాత్ర ప్రారంభమై 31న హైదరాబాద్ ఇందిరా ధర్నా చౌక్ కు చేరుకుంటుందన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగానే సీపీఎం పోరాటం చేస్తుందన్నారు. భూ నిర్వాసితుల రైతుల ఖాతాలో నిధులు జమ చేయాలన్నారు. పాలమూరి రంగారెడ్డి ప్రాజెక్టు ఎదుల రిజర్వాయర్ ద్వారా డిండి ప్రాజెక్టుకు నీళ్లు తేవాలన్నారు. డిండి ప్రాజెక్టు ద్వారా రాచకొండ ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి రిజర్వాయర్ ద్వారా నారాయణపూర్, చౌటుప్పల్ మండలాల గ్రామాలకు గ్రావిటీ ద్వారా సాగు నీరు అందించాలని కోరారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా నవాబుపేటకు నీళ్లు ఇస్తామని సుమారు 15 సంవత్సరాల కింద కాల్వలు తోవ్వారని కానీ అందులో నీళ్లు లేక నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ధర్మారెడ్డిపల్లి కాలువ వెడల్పు పనులు నిలిచిపోయాయి అన్నారు. పిలాయిపల్లి, బునాదిగాని కాలువల పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. కాలువల కింద 30 కల్వర్టులు కట్టవలసి ఉందన్నారు. ఈ నెల 16న సాగు తాగునీటి సమస్య పరిష్కారం కోసం రౌండ్ టేబుల్ సమావేశం భువనగిరిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 31న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహా ధర్నాకు పెద్ద ఎత్తున అన్ని వర్గాలు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్ పాల్గొన్నారు.

### పాముకాటు పసరు, మంత్రాలు కాకుండా వైద్య చికిత్సే ముఖ్యం

పాము కరిచిన ప్రతి సందర్భంలోనూ విషం శరీరంలోకి వెళ్లకపోవచ్చు. కానీ విషసర్పం కాటై విషం శరీరంలోకి ప్రవేశించినప్పుడు యాంటీ స్నేక్ వీనమ్ (ASV) ఆధారిత వైద్య చికిత్స అత్యంత కీలకం. పసరు మందులు, మంత్రాలు, నాటు వైద్యం అంటూ ఆసుపత్రికి వెళ్లడాన్ని ఆలస్యం చేయకూడదు. పాము కాటు అనుమానం వచ్చిన వెంటనే వైద్య సహాయం పొందడమే ప్రాణాలను కాపాడే ముఖ్యమైన చర్య.



# చేయూత పింఛన్లకు 'గోల్డెన్ ఛాన్స్'

**- అర్హులైన ఏ ఒక్కరూ మిస్ కావొద్దు..**
**- గుర్తించే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి .**
**- వారంలో పూర్తి కావాల్సిందే..**
**- గ్రామం, వార్డు వారీగా సర్వే.. అర్హులతో దరఖాస్తు చేయించాలి**
**- అధికారులంతా సమన్వయంతో యుద్ధప్రాతిపదికన పనిచేయాలి..**
**- కలెక్టర్ చిత్రా మిశ్రా**

**ముద్ర, కరీంనగర్ :** అర్హులైన పేదలకు చేయూత పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో జిల్లాలో అర్హులైన ఏ ఒక్కరూ మిస్ కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కొత్తగా పింఛన్లకు అర్హత పొందే వారిని శాచురేషన్ మోడ్‌లో గుర్తించి, వారం రోజుల్లో అర్హులందరినీ గుర్తించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి గ్రామము ప్రతి వార్డు వైజ్ గా ఈ ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన పకడ్బందీగా చేపట్టాలని స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో డి ఆర్డిఓ, జిల్లా సంక్షేమ శాఖ, మెప్మా, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా పరిషత్, మున్సిపల్ అధికారులతో కలెక్టర్ చిత్రా మిశ్రా చేయూత పింఛన్ల దరఖాస్తుల ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. గ్రామం, వార్డు వారీగా ముందుగా అర్హులను గుర్తించి, వారితో దరఖాస్తులు చేయించే విధానం.. చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం చాలా ఏళ్ల తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకంగా కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన పేదలందరికీ అందేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించా రు. ఆగస్టు 31 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నందున ప్రతి గ్రామం, ప్రతి వార్డు నుంచి అర్హులు దరఖాస్తు చేసుకునేలా విస్తృతంగా చైతన్యం కల్పించాలని ఆదేశించారు.

తొలి దశలో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా



బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వనున్న నేపథ్యంలో ఆయా వర్గాలకు చెందిన ప్రతి ఒక్కరినీ గుర్తించాలని తెలిపారు.

**ఇంటింటి సర్వేతో అర్హుల గుర్తింపు**

గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఇతర సిబ్బంది సహకారంతో విస్తృతంగా సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, ఒంటరి మహిళలు, వితంతువులు, ఇతర పింఛన్లకు అర్హులైన వారిని గుర్తించి దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు.

ఒక్క అర్హుడి కేసు కూడా మిస్ కాకుండా అధికారులు ఈ ప్రక్రియను ఒక సవాలుగా తీసుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కొత్తగా ఎంతమంది పింఛన్లకు అర్హులవుతారో కార్యాచరణ ప్రణాళిక ప్రకారం గుర్తించి, వారి నుంచి దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు.

**ధ్రువపత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలి .**

ఒంటరి మహిళలు తమ జనన ధ్రువపత్రం, ఎస్సెస్సీ మెమో, ఓటరు గుర్తింపు కార్డు (EPIC) వంటి అందుబాటులో ఉన్న పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు అవగాహన కల్పించాలనీ, అవసరమైన సందర్భాల్లో స్థానిక విచారణ, సంబంధిత ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేయించాలని సూచించారు. వితంతు మహిళలు తమ భర్త మరణ ధ్రువపత్రాన్ని అందుబాటులో ఉంచుకోవాలని, దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ సిద్ధంగా ఉంచుకుని చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేలా అధికారులు ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు.

**పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి**

కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో ఈ ప్రక్రియను మరింత సవాలుగా తీసుకుని అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. కరీంనగర్‌లో కార్పొరేటర్లు, ఇతర మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో మున్సిపల్ అధికారులు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు.గ్రామాల్లో అంగన్వాడి కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళల సహకారం తీసుకుని అర్హుల గుర్తింపు, దరఖాస్తు ల స్వీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, సంక్షేమ శాఖ, మెప్మా, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు.

అర్హుల గుర్తింపు నుంచి దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ డేటా నమోదు, క్షేత్రస్థాయి పరిశీలన, తుది జాబితా తయారీ వరకు ఎక్కడా తప్పిదాలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులందరికీ చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. పేదలకు న్యాయం చేయడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని అర్హులను మాత్రం మిస్ చేయవద్దని మరోసారి సూచించారు.

ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఆర్‌డీవో గీత, మెప్మా పీడీ స్వరూపారాణి, డీపీవో జగదీశ్వర్‌తో పాటు మున్సిపల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జెనోమ్ వ్యాలీలో యామ్జెన్ పరిశోధన కేంద్రం



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణలోని జెనోమ్ వ్యాలీలో గ్లోబల్ బయోటెక్నాలజీ దిగ్గజం యామ్జెన్ (Amgen) అత్యాధునిక పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు మంగళవారం ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో తెలంగాణ ప్రభుత్వంతో యామ్జెన్ ఒప్పందం చేసుకుంది. ఈ కేంద్రం ద్వారా స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు. నైపుణ్యమున్న మానవ వనరులు, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, జెనోమ్ వ్యాలీ ఎకోసిస్టమ్ కారణంగా తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగానికి కీలక కేంద్రంగా ఎదుగుతోందని ఆయన అన్నారు.

## లక్ష్మీనగర్ డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

*** కార్పొరేటర్ చంద్ర కోరిక మేరకు 37వ డివిజన్ లో డిప్యూటీ మేయర్ సునీల్ రావు క్షేత్రస్థాయి పర్యటన**
*** డ్రైనేజీ, స్థానిక సమస్యలను పరిశీలించి అధికారులతో మాట్లాడి కార్పొరేటర్ కు పలు పరిష్కార సూచనలు**



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ లోని కమాన్ రోడ్ లక్ష్మీనగర్ లోని రెండు వీధుల్లో వర్షపు నీరు నిలవడం మరియు డ్రైనేజీ సమస్యల వలన స్థానిక కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు కార్పొరేటర్ కె ఏపిపి చంద్ర కోరిక మేరకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్– మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు క్షేత్రస్థాయిలో పర్యటించారు.

ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా మరియు డ్రైనేజీ సమస్య వలన 37వ డివిజన్ లక్ష్మీనగర్ లోని రెండు వీధుల్లో ప్రధాన రోడ్లపైన మురికి నీరు భారీగా నిలిచిపోయింది. దీనివల్ల తీవ్రమైన దుర్వాసన రావడంతో పాటు స్థానిక ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను గమనించిన స్థానిక కార్పొరేటర్ కె.ఏ.పి.పి. చంద్ర తక్షణమే స్పందించి, పరిస్థితిని పరిష్కరించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావును కోరారు. కార్పొరేటర్ కోరిక మేరకు, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఆ ప్రాంతానికి చేరుకుని సమస్యను స్వయంగా పరిశీలించారు. సమస్యను పూర్తిగా అరికట్టడానికి ఏ విధమైన చర్యలు తీసుకోవాలో స్థానిక కార్పొరేటర్ కె ఏపిపి చంద్ర గారికి ఆయన పలు సూచనలు చేశారు. నీరు నిలిచిపోయిన ప్రాంతాలను పరిశీలించిన అనంతరం, యాదగిరి సునీల్ రావు గారు నేరుగా కాలనీ వాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో పదేపదే తలెత్తుతున్న ఈ మురికినీటి సమస్యకు తాత్కాలికంగా కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని యాదగిరి సునీల్ రావు గారు కార్పొరేటర్ కు పలు సూచనలు చేశారు.

ఈ సూచనల మేరకు తగిన పనులు చేయిస్తే సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని, ప్రజలకు ఈ ఇబ్బందులు తప్పుతాయని ఆయన స్పష్టం చేశారు. కార్పొరేటర్ కూడా ఈ దిశగా పనులు ముమ్మరం చేసేందుకు సిద్ధమయ్యారు.

# ఆనాడు బీఆర్ఎస్ కబ్జాలు ఈనాడు బీజేపీ దాడులు

**- ప్రశాంత కరీంనగర్ ప్రజలను పరేషాన్ చేస్తామంటే చూస్తూ ఊరుకోం**
**- కాంగ్రెస్ ప్రభుత్వంలో కబ్జాలు,దాడులు చేసిన వారిపై కఠిన చర్యలుంటాయి**
**- బాధ్యత గల పదవిలో ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జరుగుతున్న దాడులపై సమాధానం చెప్పాలి**
**- సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ ను ప్రజలు ఆనాడు బీఆర్ఎస్ కు అప్పగిస్తే కొందరు కార్పొరేటర్లు స్వయంగా కబ్జాలకు పాల్పడ్డారని ఈనాడు బీజేపీ కి అప్పగిస్తే దాడులకు పాల్పడుతున్నారని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు.స్థానిక ముఖరంపుర లోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ కార్పొరేటర్లు భూకబ్జాలకు పాల్పడ్డారని మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ నాయకులు అనేక మాయ మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారని ఇప్పుడు కొందరు బీజేపీ కార్పొరేటర్లు దాడులకు దిగుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి వాటిని సహించదని ప్రశాంత కరీంనగర్ ప్రజలను పరేషాన్ చేస్తామంటే చూస్తూ ఊరుకోదని నరేందర్ రెడ్డి హెచ్చరించారు.భాధ్యత గల పదవిలో ఉన్న బండి సంజయ్ కుమార్ జరుగుతున్న దాడులపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఏపార్టీకి చెందిన వారైనా స్థానిక ఎమ్మెల్యే అధికారిక క్యాంపు కార్యాలయం పై స్వయంగా బీజేపీ కార్పొరేటర్లు దాడికి దిగారని,ఢిల్లీలో విద్యార్థులపై,యువకులపై బాష్పవాయువు,లాఠీ చార్జి, పెల్లెట్ గన్స్ తో దాడి జరుగుతే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ఆఫీసు ముందు శాంతియుతంగా నిరసన చేద్దామని కాంగ్రెస్ నాయకులం వెళ్తే ఒక బీజేపీ కార్పోరేటర్ కర్రలతో దాడికి దిగాడని ఈ రోజు కిసాన్ నగర్ లో ఇంకొక బీజేపీ కార్పోరేటర్ కు సంబంధించిన వ్యక్తులు ఏకంగా కత్తులతో బీరు సీసాలతో దాడులకు పాల్పడ్డారని ఇటువంటి సంస్కృతి మంచిది కాదని నరేందర్ రెడ్డి అన్నారు.పోలీసులు వెంటనే స్పందించి నిందుతులను అరెస్ట్ చేశారని ప్రజలు భయభ్రాంతులకు గురి కావాల్సిన అవసరం లేదని ఇటువంటివి పునరావృతం కాకుండా రాష్ట ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ విలేకరుల సమావేశంలో మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండి తాజ్, కార్పోరేటర్లు వారాల నర్సింగం, పర్వతం మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,లయిక్,దండి రవీందర్,కుర్ర పోచయ్య,ముక్క భాస్కర్,జీడి రమేష్,ఎండి చాంద్,షబానా మహమ్మద్,తోట అంజయ్య,గుడిపాటి రమణా రెడ్డి,బషీర్,భారీ,బత్తుల రాజ్ కుమార్,ఖలీల్,మేకల నర్సయ్య,జాఫర్,ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు టాస్క్ ఫోర్స్ బృందాలు

**- నిందితులను పట్టుకునేందుకు చర్యలు - ఎస్పీ జానకి షర్మిల**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లాలోని పలు నేరాలపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించి రెండు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసిందని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలు, నిందితుల కదలికలు, గత నేరాల వివరాలను సమన్వయం చేస్తూ వారం రోజుల వ్యవధిలో 20 ఆస్తి నేరాల చేధన తో పాటు మరో 15 కేసుల్లో కీలకమైన ఆధారాలు సేకరించామన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.బైంసా టౌన్ పరిధిలోని పోచమ్మ ఆలయంలో జరిగిన హుండీ చోరీ కేసును కేసు నమోదైన 48 గంటల్లోనే చేధించామన్నారు. బైంసా టౌన్ పరిధిలో ద్విచక్ర వాహన చోరీ, దృష్టి మళ్లింపు ద్వారా వృద్ధురాలి ఆభరణాల అపహరణ, కైలాస్ ఫ్యాక్టరీ సమీపంలోని ఇంటి దొంగతనం, గోకుల్ నగర్ అపార్ట్ మెంట్ లో జరిగిన చోరీ కేసులపై ప్రత్యేక దర్యాప్తు కొనసాగుతుందన్నారు. నిర్మల్ టౌన్ పరిధిలో మహాదేవ్ పురం, శాస్త్రినగర్, సోఫీనగర్, గొల్లపేట్ రోడ్, బంగల్ పేట్, దివ్యనగర్ తదితర ప్రాంతాల్లో జరిగిన ఇంటి దొంగతనాలు, కాపర్ వైర్ చోరీలు, ఆలయ చోరీ కేసులను చేధించామన్నారు. ఇంటి దొంగతనాల్లో బంగారం, వెండి ఆభరణాలు, నగదు, ఆలయాల్లో చోరీకి గురైన వెండి ఆభరణాలు, ఇతర వస్తువులకు సంబంధించిన కేసుల్లో నిందితుల ప్రమేయాన్ని గుర్తించి తదుపరి చట్టపరమైన చర్యలు కొనసాగిస్తున్నామన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు భైంసా టౌన్ పరిధిలో 5 చెక్ పోస్టులు, నిర్మల్ టౌన్ 7 చెక్ పోస్టుకు, సారంగాపూర్ పోలిసు స్టేషన్ పరిధిలో 1 చెక్ పోస్టు సహా జిల్లాలో మొత్తం 13 ప్రత్యేక పోలీస్ చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఈ చెక్ పోస్టుల ద్వారా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి విస్తృత తనిఖీలు చేపట్టారని అన్నారు. ప్రతి రోజు అధికారులు చెక్ పోస్టులను తనిఖీ చేస్తూ, సిబ్బంది పనితీరు, వాహన తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తుల పరిశీలన తదితర అంశాలను పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో ఇటీవల జరిగిన పలు ఆస్తి నేరాలకు సంబంధించి ఒక పెద్ద నేర ముఠా కదలికలపై ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేస్తున్నాయని అన్నారు. ముఠా సభ్యుల కదలికలు, గతంలో జరిగిన నేరాలతో ఉన్న సంబంధాలు, వివిధ కేసుల్లో వారి పాత్ర తదితర అంశాలను సాంకేతిక ఆధారాలతో విశ్లేషిస్తున్నామని అన్నారు. దర్యాప్తు పూర్తయిన వెంటనే సంబంధిత నిందితులను అదుపులోకి తీసుకుని మరిన్ని కేసులను ఛేదించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. జిల్లాలో గంజాయి వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచి కేసులు నమోదు చేస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నిర్మల్ అయ్యప్ప స్వామి ఆలయంలో జరిగిన చోరీతో పాటు జిల్లాలోని ఇతర దేవాలయాల్లో జరిగిన చోరీలు, ఇళ్లలో జరిగిన దొంగతనాల కేసుల్లో నిందితుల ముఠాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారని వివరించారు. జిల్లాలో రెండు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు ఆస్తి నేరాల ఛేదనపై ప్రత్యేకంగా పని చేస్తున్నాయని అన్నారు. ఒక టాస్క్ ఫోర్స్ కు బైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నాయకత్వం వహిస్తుండగా, మరో టాస్క్ ఫోర్స్ కు నిర్మల్ డిఎస్పీ పి. శ్రీనివాస్ నాయకత్వం వహిస్తున్నారన్నారు. నేరాల నియంత్రణ, కేసుల త్వరితగతిన ఛేదన, ప్రజల ఆస్తి, ప్రాణాలకు భద్రత కల్పించడమే నిర్మల్ పోలీసుల ప్రధాన కర్తవ్యమని ఎస్పీ తెలిపారు.

## కోరుట్ల పట్టణంలో ఘనంగా తిరంగా ర్యాలీ



**ముద్ర, కోరుట్ల;** భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారు తలపెట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఇందూరు పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వై అనుప్ రావు ఆదేశానుసారం భారతీయ జనతా పార్టీ కోరుట్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో పట్టణ బిజెపి అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ అధ్యక్షతన కోరుట్ల పట్టణంలోని ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో కోరుట్ల పట్టణంలో భారీ జాతీయ పతాకంతో తిరంగా ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా విచేసిన డా. వై. అనూప్ రావు, ఐఎంఏ మహిళ విభాగం అధ్యక్షురాలు స్వీతి అనూప్ రావు మాట్లాడుతూ స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత దేశంలో ప్రతి ఒక్కరు కుల, మత తేడా లేకుండా స్వతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటారని అన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరు జరుపుకునే పండుగని ఈ కార్యక్రమానికి పాఠశాల విద్యార్థులను తీసుకువచ్చిన స్కూల్ యాజమాన్యానికి విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఇందూరి తిరుమల వాసు, జిల్లా కార్యదర్శి సూదవేణి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తులసి కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శిలు ఎర్ర రాజేందర్, చెట్లపెల్లి సాగర్, గందె నవీన్, పాల్గొన్నారు.

## ఆగస్టు 31లోపు చేయూత పెన్షన్లకు దరఖాస్తులు చేసుకోవాలి

**- ఎంపీడీవో వోదెల రామకృష్ణ....**



**ముద్ర, కోరుట్ల :** చేయూత, సామాజిక భద్రతా పింఛన్ల పథకం కింద కొత్త పింఛన్ల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కోరుట్ల మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి వోదెల రామకృష్ణ తెలిపారు. మొదటి దశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత, చేనేత కార్మికులు, ఫైలేరియా, థలసేమియా, సికిల్ సెల్, హీమోఫీలియా బాధితులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రజాపాలన వారం, గ్రామసభలు, ప్రజావాణిలో దరఖాస్తు చేసి పత్రాలు సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదన్నారు. మిగతావారు అవసరమైన ధ్రువపత్రాలతో గ్రామపంచాయతీ కార్యదర్శుల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వితంతువులు భర్త మరణ ధ్రువపత్రం, ఒంటరి మహిళలు ఎన్‌క్వైరీ రిపోర్ట్, గీత కార్మికులు ఎక్సైజ్ ధ్రువీకరణ, చేనేత కార్మికులు హ్యాండ్లూమ్స్ శాఖ ధ్రువీకరణ, ఫైలేరియా బాధితులు వైద్య ధ్రువపత్రం సమర్పించాలి. దరఖాస్తులు చేయూత పోర్టల్‌లో అర్హులైన వారు ఆగస్టు 31, దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 12.08.2026
www.mudranews.in | @mudranews
7
జనరల్ న్యూస్
GENERAL NEWS

## పాముకాటు ప్రాంతాన్ని రుద్దొద్దు, కోయొద్దు



పాము కరిచిన చోట కడగడం, రుద్దడం, కోయడం, కాల్చడం వంటి పనులు చేయకూడదు. కాటు నుంచి విషాన్ని బయటకు తీయాలనే ఉద్దేశంతో చేసే ఇలాంటి చర్యలు ప్రయోజనం కంటే హానినే కలిగించవచ్చు. కాటు ప్రాంతాన్ని వీలైనంత వరకు కదలకుండా ఉంచి ఆసుపత్రికి తరలించాలి.

## నిర్ణీత సమయంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

### జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్




**ముద్ర, శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్లు మరియు ఇంజనీరింగ్ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జోన్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, "వన్ డే – వన్ వార్డ్" కార్యక్రమం పురోగతిపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన కొత్త పనుల ప్రతిపాదనలు మరియు ప్రస్తుతం కొనసాగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో డిప్యూటీ కమిషనర్లతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా పనులన్నీ నాణ్యతతో పూర్తి కావాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని డిప్యూటీ కమిషనర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు మరియు ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా 'రన్ ఫర్ వందేమాతరం'

### ముఖ్య అతిథిగా పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

**ముద్ర, కూకట్‌పల్లి :** భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని, జాతీయ గీతం 'వందేమాతరం' 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విశ్వహిందూ పరిషత్–బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలో "రన్ ఫర్ వందేమాతరం – విద్యార్థి దళ్" కార్యక్రమం దేశభక్తి ఉత్సాహంతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని "వందే మాతరం", "భారత్ మాతాకీ జై" నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. 'విద్యార్థి శక్తి – దేశ శక్తి' అని, నేటి విద్యార్థులే రేపటి భారతదేశ భవిష్యత్తుకు మార్గదర్శకులని పేర్కొన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ విద్య, క్రీడలు, సేవా కార్యక్రమాల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యోద్యమంలో ప్రజల్లో స్ఫూర్తిని నింపిన వందేమాతరం జాతీయ భావాలను నేటి తరానికి అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రాంత ఉపాధ్యక్షులు మోహన్ రావు, ప్రాంత సహాయ కార్యదర్శి రమేష్, బజరంగ్ దళ్ ప్రతినిధులు, బీజేపీ నాయకులు జీవన్, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ చారి, శివాచారి, మహేందర్ తో పాటు విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

### తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి




**ముద్ర ప్రతినిధి, తాండూర్ :** రాజకీయాలకతీతంగా బషీరాబాద్ మండల కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేయడం జరుగుతుందని తాండూరు శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. తాండూర్ నియోజకవర్గ పరిధిలోని బషీరాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన "సర్వసభ్య సమావేశంలో" ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో విస్తృతంగా చర్చించారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు, విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఏఈకి ఆదేశించారు.రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్య నిర్వాహణపై సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలనీ సంబంధిత అధికారులకు ఆదేశించడం జరిగింది. అలాగేగ్రామాల్లో వర్షాకాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలనీ, అదేవిధంగా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు, సర్పంచ్ లకు ఆదేశించడం జరిగింది.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలసి పని చేసినప్పుడే ప్రజలకు న్యాయం చేయగలుగుతామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ మహారాజ్ గారు, ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి గారు, వెంకట్ రాం రెడ్డి గారు, అన్ని గ్రామాల సర్పంచ్ లు, మండల స్థాయి అధికారులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**నియోజకవర్గాన్నిఅన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా**

తాండూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోఅభివృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో మీడియాతో మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ తాండూరులో పారదర్శకంగా పూర్తి అయ్యిందన్నారు. నియోజకవర్గంలో దాదాపు 65వేల ఓట్లు తొలిగిపోయే అవకాశం ఉందని తెలిపారు. ఈ పక్రియ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపవచ్చన్నారు. తాండూరు అభివృద్ధికి పక్కా ప్రణాళికలతో ముందుకు సాగడం జరుగుతుందని, ఇప్పటికే మంజూరు చేసిన రూ.1500 కోట్ల విలువైన పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయని అన్నారు. ఎన్నికలకు ఒక యేడాది ముందే అన్ని పనులు పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. తాండూరులోని ప్రభుత్వ ఆసుప్రతిని మెరుగు పరిచి కార్పోరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలనే కృతనిశ్చయంతో ఉన్నామని స్పష్టం చేశారు. త్వరలోనే కాగ్నా నది నుంచి నీరును అందించేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. మురుగునీటి శుద్ధి కర్మాగారాలు(ఎస్‌టీపీ) నిర్మించేందుకు దృష్టిసారిస్తున్నామని అన్నారు. తాండూరులోని నిరుద్యోగుల కోసం కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదేవిధంగా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ స్థలాలు అక్రమనకు గురికాకుండా బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ పట్లోళ్ల నీరజ, డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, తాండూర్ పట్టణ అధ్యక్షులు బాతుల నాగరాజ్, ఎస్ ఐ ఆర్ కన్వీనర్ కరణం పురుషోత్తం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్రెడ్డి పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నియంత్రణపై అవగాహనకు రేపు భారీ ర్యాలీ



**ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 11:** రాష్ట్రంలో హెచ్ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ తదితర వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, వాటి నియంత్రణకు చర్యలు చేపట్టేందుకు ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు విస్తృత ప్రచార, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ తెలిపారు.ఇందులో భాగంగా బుధవారం ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌లోని ఐమాక్స్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్ నుంచి నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వరకు సుమారు 1,500 మందితో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక శాసనసభ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు.నగరంలోని పలు కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో పాటు నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు, ఇతర పౌరులు ర్యాలీలో పాల్గొననున్నారు. ఉదయం 7 గంటలకు మంత్రులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించడంతో పాటు పాల్గొని ప్రజలకు అవగాహన సందేశాన్ని ఇవ్వనున్నారు.కొత్తగా ఎవరూ హెచ్ఐవీ బారిన పడకుండా, ఇప్పటికే సంక్రమించిన వారి నుంచి ఇతరులకు, ముఖ్యంగా పుట్టబోయే శిశువులకు వైరస్ సంక్రమించకుండా అడ్డుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని విద్యాసాగర్ పేర్కొన్నారు. ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. "బీ పాజిటివ్ టు స్టాప్ హెచ్ఐవీ పాజిటివ్" అనే నినాదంతో ముందుకు సాగుతూ తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ర్యాలీలో పాల్గొని ప్రచార కార్యకర్తలుగా మారాలని తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది.

## కేబీఆర్ పార్కు చుట్టూ 18 నుంచి వన్‌వే

**ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 11:** నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న రహదారుల్లో ఈనెల 18వ తేదీ నుంచి వన్‌వే విధానం అమలు చేయనున్నారు. కేబీఆర్ పార్కు పరిసరాల్లోని పలు కూడళ్ల వద్ద అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్ల నిర్మాణానికి గతంలోనే నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో, నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా కొత్త ట్రాఫిక్ విధానాన్ని అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు.వన్‌వే అమలుకు అనుగుణంగా ఇప్పటికే ట్రాఫిక్ పోలీసులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ జాయింట్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తుండగా, నగర సీపీ కూడా ప్రత్యేకంగా పరిస్థితిని సమీక్షిస్తున్నారు.కొత్త ట్రాఫిక్ మార్పుల ప్రకారం జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి పంజాగుట్ట వైపు ఉన్న రెండు వైపుల రహదారుల్లో వాహనాల రాకపోకలకు అనుమతిస్తారు. కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న రెండు లైన్ల రహదారుల్లో మాత్రం ఒక్కో రహదారిపై ఒకే దిశలో వాహనాలను అనుమతించనున్నారు.వన్‌వే అమలుకు సంబంధించిన పూర్తి వివరాలను హైదరాబాద్ సీపీ, ట్రాఫిక్ జాయింట్ సీపీ మంగళవారం సాయంత్రం నిర్వహించే మీడియా సమావేశంలో వెల్లడించనున్నారు. వాహనదారులు కొత్త ట్రాఫిక్ మార్గదర్శకాలను పాటించి పోలీసులకు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

## వసంతపురి సబ్‌స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం

**ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 11:** పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా హబ్సిగూడ సర్కిల్ పరిధిలోని వసంతపురి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 12.5 ఎంవీఏ నుంచి 16 ఎంవీఏకు పెంచినట్లు టీజీఎస్పీడీసీఎల్ అధికారులు తెలిపారు.టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ మార్గదర్శకత్వంలో చేపట్టిన ఈ అప్‌గ్రేడేషన్‌ను సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) డా. ఎన్. నరసింహులు రిబ్బన్ కట్ చేసి, స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్ల సామర్థ్య పెంపు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల అప్‌గ్రేడేషన్, కొత్త మౌలిక వసతుల ఏర్పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. వసంతపురి సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంచడం వల్ల వసంతపురి, మల్కాజ్‌గిరి, సైనిక్‌పురి, పరిసర ప్రాంతాల్లోని వినియోగదారులకు మెరుగైన వోల్టేజ్‌తో నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు.ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్య పెంపుతో ఆయా ప్రాంతాల్లో లోడ్ పంపిణీ మెరుగుపడి, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, విద్యుత్ అంతరాయాలు తగ్గే అవకాశం ఉందన్నారు. భవిష్యత్‌లో విద్యుత్ డిమాండ్ పెరిగినా వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈ అప్‌గ్రేడేషన్ ఉపయోగపడుతుందని తెలిపారు.ప్రజలకు సురక్షితమైన, విశ్వసనీయమైన, నిరంతరాయ విద్యుత్ సేవలు అందించడమే టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన లక్ష్యమని డా. నరసింహులు అన్నారు.కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ (ఆపరేషన్స్), మేడ్చల్ జోన్ రమేష్, హబ్సిగూడ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వెంకన్నతో పాటు డివిజనల్, సబ్ డివిజనల్ అధికారులు, ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిరిగిన, పాడైన నోట్లను మార్చుకోవడం ఎలా?




చిరిగిన, మురికిగా మారిన, పాడైన కరెన్సీ నోట్లను మార్చుకునే అవకాశం ప్రజలకు ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఇలాంటి నోట్లను నిర్ణీత విధానంలో బ్యాంకు శాఖల్లో సమర్పించి మార్పిడి చేసుకోవచ్చు. పాడైన నోట్లను బ్యాంకు శాఖలు స్వీకరించి, నిబంధనల ప్రకారం వాటి విలువను నిర్ణయించి మార్పిడి చేయాల్సి ఉంటుంది.ఎలా మార్చుకోవాలి?చిరిగిన లేదా పాడైన నోట్లను సమీపంలోని బ్యాంకు శాఖకు తీసుకెళ్లి మార్పిడి కోసం సమర్పించాలి. నోటు పరిస్థితి, దాని విలువను బట్టి బ్యాంకు అధికారులు ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం నగదు లేదా ఇతర విధానంలో పరిష్కరిస్తారు. పెద్ద మొత్తంలో పాడైన నోట్లు ఉన్న ప్రత్యేక నిబంధనలు వర్తించవచ్చు.బ్యాంకు శాఖ నోట్లను మార్చేందుకు నిరాకరిస్తే, ముందుగా సంబంధిత బ్యాంకులో ఫిర్యాదు చేయడం మంచిది. సమస్య పరిష్కారం కాకపోతే ఆర్‌బీఐ ఫిర్యాదు వ్యవస్థ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.గమనిక: అత్యంత కాలిపోయిన, బాగా పెళుసుగా మారిన లేదా నోటు ముఖ్యమైన వివరాలు గుర్తించలేని స్థితిలో ఉన్న నోట్లకు ప్రత్యేక విధానం ఉంటుంది. ఇలాంటి నోట్లను ఆర్‌బీఐ కార్యాలయాలు లేదా నిర్దేశిత కరెన్సీ చెస్ట్ శాఖల ద్వారా పరిశీలనకు పంపాల్సి రావచ్చు.ప్రజలు చిరిగిన, పాడైన నోట్లను చెలామణిలో పెట్టకుండా సమీప బ్యాంకు శాఖలో మార్పిడి చేసుకోవాలని ఆర్‌బీఐ సూచిస్తోంది.

– ముద్ర, హైదరాబాద్

## బోనాల వేడుకల్లో దత్తన్న

హైదరాబాద్ రామ్ నగర్ లోని బోనాల వేడుకలో మాజీ కేంద్ర మంత్రి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు రాకేష్ దత్త పాల్గొన్నారు.



## హైకోర్టు కాలనీలో పార్క్, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి చేస్తా

### ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ముద్ర, కాప్రా:** బీరప్పగడ్డ డివిజన్‌లోని హైకోర్టు కాలనీలో ఉన్న ఓపెన్ స్పేస్‌ను అభివృద్ధి చేసి పార్క్, ఓపెన్ జిమ్, ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, హైకోర్టు కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి జోనల్ కమిషనర్ రాధిక గుప్తాను ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు.హైకోర్టు కాలనీలో సుమారు 4 వేల గజాల విస్తీర్ణంలో హెచ్ఎండీఏ ఏర్పాటు చేసిన నర్సరీని తొలగించి, ఆ స్థలంలో కాలనీ వాసుల కోసం నూతన పార్క్, ప్లే ఎక్విప్‌మెంట్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే కాలనీలో దెబ్బతిన్న సీసీ రోడ్లను పునరుద్ధరించడం, స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ పైప్‌లైన్ ఏర్పాటు చేయడం, సెంట్రల్ మీడియన్‌కు రంగులు వేయించాలని జోనల్ కమిషనర్‌ను కోరారు.కాలనీ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, హైకోర్టు కాలనీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రాజ్, అసోసియేషన్ సభ్యులు గోపాల్ దాస్, సుధీర్ కుమార్, నరసింహారావు, వెంకటేశ్వర్లు, మహమ్మద్ అబ్బాస్, మహమ్మద్ ఫ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి–షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ




**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజిగిరి తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి–షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, తహసీల్దార్ శ్రీమతి సుజాత తో కలిసి 22 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, పేద , మధ్యతరగతి కుటుంబాలకు ఆడపిల్లల వివాహ సమయంలో ఆర్థిక భరోసా కల్పించేందుకు కల్యాణలక్ష్మి–షాదీ ముబారక్ పథకం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందని అన్నారు. ఆడపిల్లల తల్లిదండ్రులపై వివాహ ఖర్చుల భారం తగ్గించడంలో ఈ పథకం కీలకంగా సహాయపడుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 22 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.22,02,552 విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు జీకే హనుమంతురావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్న బీజేపీ పాలనను ప్రజలే ఓడించాలి

### సిపిఐ రాష్ట్ర నాయకులు వియస్. బోస్



**ముద్ర, కాప్రా:** భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపు మేరకు ఆగస్టు 6 నుండి 14 వరకు నిర్వహిస్తున్న "బీజేపీ ప్రజా వ్యతిరేక పాలనకు అంతం పలుకాలి" అనే పాదయాత్ర ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉప్పల్ డివిజన్ లో కరపత్రాలను పంచుతూ పాదయాత్రలు నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వియస్. బోస్. మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రాజ్యాంగ వ్యతిరేక విధానాలపై సీపీఐ చేపట్టిన పాదయాత్ర ప్రచారం కొనసాగిందన్నారు . ఈ సందర్భంగా ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రతను దెబ్బతీయడం, దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించడం, ప్రజా ఉద్యమాలను అణచివేయడం వంటి చర్యలను ప్రజలకు వివరించారు.మతం, కులం పేరుతో ప్రజలను విభజించే రాజకీయాలకు స్వస్తి పలకాలని, దేశ ఐక్యత, లౌకికత, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల హక్కుల కోసం ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జీ. దామోదర్ రెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి. సత్య ప్రసాద్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు

## 10 వేల మంది ఆస్తి యజమానులకు ఊరట



**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజ్‌గిరిలో దాదాపు 10 వేల మంది ఆస్తి యజమానులకు ఊరట కలిగించే విధంగా, పొరపాటుగా 22–ఏ నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చిన కొన్ని సర్వే నంబర్ల సమస్య పరిష్కార దిశగా కీలక ముందడుగు పడింది. మల్లాపూర్ గ్రామానికి చెందిన సర్వే నంబర్లు మల్కాజ్‌గిరి గ్రామానికి చెందినవిగా వక్ఫ్ రికార్డుల్లో నమోదైనట్లు గుర్తించిన తెలంగాణ వక్ఫ్ బోర్డు, అవసరమైన గెజిట్ సవరణలకు చర్యలు చేపట్టింది.ఈ సమస్యపై మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సంబంధిత అధికారులతో నిరంతరం ఫాలోఅప్ చేసి, ఆధార పత్రాలు సమర్పించి పరిష్కారానికి కృషి చేశారు. దీంతో సంవత్సరాలుగా రిజిస్ట్రేషన్లు, ఆస్తి లావాదేవీలలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేలాది మంది యజమానులకు ఉపశమనం లభించనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మల్కాజ్‌గిరి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 12.08.2026
www.mudranews.in | @mudranews



### పాముకాటు బాధితుడికి ధైర్యం చెప్పండి



పాము కరిచిందని భయపడటం సహజం. అయితే భయాందోళనకు గురైతే పరిస్థితి మరింత తీవ్రం కావచ్చు. బాధితుడిని ప్రశాంతంగా ఉంచి, విషానికి విరుగుడు మందు అందుబాటులో ఉందని భరోసా ఇవ్వాలి. వీలైనంత తక్కువ కదలికతో విశ్రాంతిగా ఉంచాలి.

# రైతులు ఆరుతడి పంటలను పండించాలి

**జిల్లా కలెక్టర్ హైమావతి**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** ఎల్ నినో వర్షాభావ పరిస్థితులలో జిల్లా రైతులు ఆరుతడి పంటలను పండించాలని జిల్లా నీటిపారుదల సలహా కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిస్టిక్ ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి, ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవనం శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గజ్వేల్ సర్కిల్ చీఫ్ ఇంజనీర్ శివధర్మతేజ జిల్లాలో గల అన్నపూర్ణ సాగర్ 3.50 టీఎంసీలకు గాను 1.51 టీఎంసీల నీరు ఉండదని వాటిలో 0.32 డెత్ స్టోరేజ్ ఫోన్ 1.19 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, రంగనాయక సాగర్ 3.00 టీఎంసీలకు గాను 0.99 టీఎంసీ నీరు ఉందని వాటిలో డెత్ స్టోరేజ్ 0.17 టీఎంసీలు పోను. 0.82 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, మల్లన్న సాగర్ 50 టీఎంసీలకు గాను 13.86 టీఎంసీల నీరు ఉందని దానిలో 9.37 టీఎంసీల నీరు డెత్ స్టోరేజ్ పోను 4.12 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, కొండపోచమ్మ సాగర్ టీఎంసీలకు గాను 15.00 టీఎంసీలకు గాను 6.31 టీఎంసీల నీరు ఉందని దానిలో 2.20 టీఎంసీల నీరు డెత్ స్టోరేజ్ పోను 4.11 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, శనిగరం ప్రాజెక్టు



1.09 టీఎంసీలకు గాను 0.46 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా అందుబాటులో ఉన్న నీటిని కేవలం త్రాగునీరు అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని రాష్ట్రప్రభుత్వం సూచించిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వలన రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితిలో ఏర్పడి జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులలో కొత్తగా నీరు చేరలేదని అన్నారు. మళ్లీ వర్షాకాలం వరకు వర్షాలు పడే సూచనలు లేదని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఇప్పుడు ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీరు అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఆదేశాల మేరకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని త్రాగునీటి అవసరాలకు అట్టి పెట్టడం జరిగిందని అన్నారు. కావున జిల్లాలో సాగునీరు లేదు కాబట్టి రైతులు వరి పంట పండించరాదని అన్నారు. గత సంవత్సరం



4.82 లక్షల ఎకరాలలో పంట వేయగా వాటిలో 3.68 లక్షల ఎకరాలలో కేవలం వరి పంట పండించడం జరిగిందని అన్నారు. 5 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యానికి ప్రభుత్వం 1200 కోట్లు పైన చెల్లించడం జరిగిందని అన్నారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల గురించి రైతులకు వివిధ రకాలుగా అవగాహన కలిగించడం మూలంగా ఈ సంవత్సరం ఇప్పటికే 70,000 ఎకరాల్లో పంట మార్పిడి జరిగి కందులు, పెసర్లు, మినుములు, చిరుధాన్యాలు, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను వేశారని తెలిపారు. ఆగస్టు 15 తర్వాత ఆముదము, పత్తి , నూనె గింజల పంటలను పండించవచ్చని ఆరుతడి పంటలను పండించాలని అన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో వర్షాలు కురిస్తే సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీటిని విడుదల చేయడానికి నీటిపారుదల శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు.ఎంఎల్సి యాదవ రెడ్డి మాట్లాడుతూ వర్షాబావ పరిస్థితులలో రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని, ప్రాజెక్టుల ద్వారా నీటిని వదిలితే గూడవల్లి, హల్దివాగులో చెక్ డ్యామ్ లను నింపితే రైతులు వ్యవసాయం చేసుకునే పరిస్థితిలో ఉన్నాయని ఆమేరకు ఆలోచించాలని సూచించారు. ఈ సందర్భంగా సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు పంపించిన లేఖను జిల్లా కలెక్టర్ చదివి వినిపించారు. ఈ లేఖలో గోదావరి నది నుండి నీరు వృధా పోకుండా లిఫ్ట్ చేసి ప్రాజెక్టులను నింపి రైతులకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని అదే విధంగా భూగర్భ జలాలను పెంచేలా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సర్కిల్ సీఈ సత్యనారాయణ రెడ్డి, సిద్దిపేట్, గజ్వేల్, కరీంనగర్ సర్కిల్ ల ఎస్ఇలు సూర్యకిరణ్, లక్ష్మణ్ పల్లంరాజు,డిస్టిక్ ఇరిగేషన్ ఆఫీసర్ నాగరాజు, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి మల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో వన మహోత్సవం

**మొక్కలు నాటిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగ ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. పరిశుభ్రత, పచ్చదనం, సమతుల్యమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కాపాడటంలో మొక్కలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. భావితరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. నేటి మొక్కలే రేపటి మహావృక్షాలు అని పేర్కొన్న ఎస్పీ.. వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందిస్తూ, అవి ఎదిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వన మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించి పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ. విక్రాంత్ కుమార్ సింగ్, సీఐలు మహేష్, జార్జ్, రాజశేఖర్ రెడ్డి, సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, ఆర్ఐలు శైలందర్, రామకృష్ణ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత కాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** సిద్దిపేట పట్టణం లో వార్డ్ వార్డ్ లో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ లు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఆధ్వర్యంలో హైదరాబాద్ సింధూ హాస్పిటల్ వారి సౌజన్యం తో సిద్దిపేట పట్టణం లో ప్రతి వార్డ్ లో మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, వైస్ చైర్మన్ కనకరాజు, పట్టణ అధ్యక్షులు సంపత్ రెడ్డి లు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నాసర్ పుర 31 వార్డ్ మహిళా భవన్ లో నేడు స్క్రీనింగ్ టెస్ట్ లు ఏర్పాటు చేయడం జరిగిందని పట్టణం లో ఈ నెల 10వ తేదీ నుండి 14వ తేదీ వరకు మొబైల్ స్క్రినింగ్ టెస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.రెండు రోజులు గా ఈ టెస్ట్ లు జరుగు తున్నాయని, మరో రెండు మూడు రోజుల పాటు ఈ స్క్రినింగ్ టెస్ట్ లు పలు వార్డ్ లో జరుగుతాయని చెప్పారు. ప్రతి వార్డ్ లో స్క్రినింగ్ టెస్ట్ వాహనం వచ్చి వార్డ్ లో ఒక సెంటర్ లో ఉంటుందని, వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకొని స్క్రినింగ్ టెస్ట్ చేస్తారని చెప్పారు.. ప్రస్తుతం కాలం లో 10 మంది లో 5 నుండి 8 మంది వరకు ఈ క్యాన్సర్ వ్యాధి వచ్చిన వారే ఉంటున్నారని..ముఖ్యం గా మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ ప్రభావం ఎక్కువ గా ఉందన్నారు.. ఇది ద్రుష్టి లో పెట్టుకొని హరీష్ రావు గారు సింధూ ఆసుపత్రి వారి సహకారం తో ఈ స్క్రినింగ్ టెస్ట్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.. ఇందులో గుర్తించి ఆపరేషన్ కానీ, ట్రీట్మెంట్ గాని ఆసుపత్రి లో అందిస్తారని చెప్పారు 40ఏళ్లు దాటిన అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమం లో వార్డ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో ఎస్ఐఆర్ వంద శాతం పూర్తి

**కలెక్టర్ ప్రతిమా సింగ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మెదక్ జిల్లా ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ...ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం జూన్ 25న ప్రారంభమైందన్నారు. తొలి దశలో జూన్ 25 నుంచి జూన్ 30 వరకు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. జూలై 1 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించడంతో పాటు ఓటర్ల వివరాల పరిశీలన, ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టారని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, పరిశీలన, డిజిటల్లైజేషన్ ప్రక్రియను మెదక్ జిల్లాలో నూరు శాతం పూర్తి చేసినట్లు వెల్లడించారు.మెదక్ నియోజక వర్గంలో మొత్తం 2,20,427 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,01705 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేసినట్లు తెలిపారు. ఇది మొత్తం ఓటర్లలో 91.51 శాతంగా ఉందని పేర్కొన్నారు.మిగిలిన 18,722 మంది ఓటర్లను అన్‌కలెక్టబుల్‌గా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో 5431 మంది మరణించినవారు, 3433 మంది డబుల్ ఎంట్రీలు ఉన్నవారు, 8948 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, 874 మంది ఆచూకీ లభించని వారు ఉన్నారని, 36 ఇతరులు ఉన్నారని వెల్లడించారు. అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన వారి శాతం 8.49 శాతంగా ఉందన్నారు.నర్సాపూర్ నియోజకవర్గంలో మొత్తం 232713 మంది ఓటర్లు ఉండగా, వారిలో



20,8499 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేసినట్లు తెలిపారు. ఇది మొత్తం ఓటర్లలో 89.59 శాతంగా ఉందని పేర్కొన్నారు.మిగిలిన 24,214 మంది ఓటర్లను అన్‌కలెక్టబుల్‌గా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో 7735 మంది మరణించిన వారు, 3414 మంది డబుల్ ఎంట్రీలు ఉన్నవారు, 12153 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, 634 మంది ఆచూకీ లభించని వారు ఉన్నారని వెల్లడించారు. 278 ఇతరులున్నారు. అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన వారి శాతం 10.41 శాతంగా ఉందన్నారు.డిజిటలైజేషన్ పూర్తయిన వారి శాతం, వివిధ కారణాలతో అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన శాతం కలిపి మెదక్ ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని కలెక్టర్ స్పష్టం చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులో సమర్థవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేసిన ఎన్నికల అధికారులు, ఈఆర్ఓ, ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలను కలెక్టర్ అభినందించారు.

## పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

**ముద్ర ప్రతినిధి, మెదక్:** చేయూత సామాజిక భద్రత పింఛన్ల కోసం అర్హులైన అభ్యర్థులు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం/ మున్సిపల్ కార్యాలయంలలో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. తెలంగాణలో చేయూత సామాజిక భద్రత పింఛన్ల కొత్త దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని చెప్పారు. ఈనెల 31 వరకు అర్హులైన నిరుపేదల నుండి దరఖాస్తులు స్వీకరించబడతాయన్నారు. దరఖాస్తు అధికారిక వెబ్‌సైట్ చేయూత పోర్టల్, గ్రామ పంచాయతీ/మున్సిపల్ కాయలయం నుండి కానీ దరఖాస్తు ఫారం పొందవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల వారు పూరించిన దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యదర్శికి లేదా ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని, పట్టణ ప్రాంతాల వారు వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు లేదా మున్సిపల్ కమిషనర్లకు సమర్పించాలన్నారు. ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత, చేనేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు, థలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా వ్యాధిగ్రస్తులు. అర్హులన్నారు. ఆదాయపరిమితిగ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షలలోపు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షల లోపు ఉండాలని వివరించారు. పింఛన్ల మంజూరుకు అవసరమైన అన్ని ధృవీకరణ పత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు.

## అల్ట్రా రన్ లో సిద్దిపేట జర్నలిస్టు ఆరుదైన రికార్డు



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** సిద్దిపేట కు చెందిన జర్నలిస్ట్ రాజు 100 కిలోమీటర్ల ఆల్ట్రా రన్ పూర్తిచేసి మెడల్ సాధించిన సందర్భంగా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిద్దిపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కల్వకుంట్ల రంగాచారి మాట్లాడుతూ ఐదు సంవత్సరాల నుంచి కష్టపడుతున్న శ్రమకు ఫలితం దక్కిందన్నారు. ఇది సిద్దిపేట జర్నలిస్టులందరి విజయం అన్నారు. రాజు భవిష్యత్తు లో మరెన్నో అద్భుతమైన విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం జర్నలిస్ట్ రాజు మాట్లాడుతూ తాను ఇది పూర్తి చేయడానికి 13 గంటల 55 నిముషాలు పట్టిందన్నారు. ఈవెంట్ లో దేశ వ్యాప్తంగా 150 మంది పాల్గొనగా, తెలంగాణ నుంచి 10 మంది, సిద్దిపేట నుంచి నలుగురు మాత్రమే సమయంలోపు 100 కిలోమీటర్ల రిచ్ అయ్యామన్నారు. ఎంతో శ్రమకు వోర్చి సాధించిన విజయం లో మీ అందరి సహకారం మరువలేదన్నారు. యువత చెడుదారుల్లోకి వెళ్లకుండా రోజు వ్యాయమం పై శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట పాత్రికేయులు పాల్గొన్నారు.

## అశ్రునయనాలతో కారోబార్ అంత్యక్రియలు

**రూ.2 లక్షల ఆర్థిక సాయం చేసిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి**

**నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్‌రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, మెదక్:**పాపన్నపేట గ్రామ పంచాయతీ కారోబార్ ఆకుల కృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా మంగళవారం అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. రెండు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. కృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం బాధాకరమని, కుటుంబానికి అండగా ఉంటామన్నారు. వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, పార్టీ నాయకులు ఉన్నారు. విషయం తెలుసుకున్న పద్మాదేవేందర్‌రెడ్డి పాపన్నపేటకు చేరుకుని కృష్ణ అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. అనంతరం కృష్ణ భార్య, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కృష్ణకు తొమ్మిది నెలల చిన్నారి ఉండటాన్ని చూసి పద్మాదేవేందర్‌రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. చిన్నారిని ఎత్తుకుని కంటతడి పెట్టారు. వెంట పార్టీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గురుమూర్తి గౌడ్, లింగారెడ్డి, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు తాడేపు సోములు, నాయకులు కాశీనాథ్‌రావు, ఉప్పరి వెంకటేశం, రంగంపేట శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## హెచ్ఐవీ పరీక్షలకు డిజిటల్ విధానం




**ముద్ర ప్రతినిధి, మెదక్:** హెచ్ఐవీ పరీక్షలకు డిజిటల్ విధానం, క్యూఆర్ కోడ్‌తో సులభంగా సేవల పోస్టర్ ను కలెక్టర్ ప్రతిమా సింగ్ విడుదల చేశారు. మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో క్యూ ఆర్ కోడ్ సేవల పోస్టర్ ను ఆవిష్కరించారు. హెచ్ఐవీ (ఎయిడ్స్)పై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, అవసరమైన వారికి పరీక్షలు, సేవలను మరింత సులభంగా అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో డిజిటల్ విధానాన్ని అందుబాటులోకి వస్తుందన్నారు.క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సమీపంలోని హెచ్ఐవీ పరీక్షా కేంద్రాలు, అందుబాటులో ఉన్న సేవలు తదితర వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని, హెచ్ఐవీపై అనుమానం ఉన్న వారు భయపడకుండా, గోప్యతకు భంగం కలగకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ హరి ప్రసాద్, ఐసిటిసి కౌన్సిలర్ ధనశ్రీ, గోపి సుధాకర్, రవి, పీఎంవో శంకర్ రాథోడ్, కాముని రాజేశ్వర్, స్కోప్ ఎన్జీవో ఉప్పలయ్య. అనిల్, లింక్ వర్కర్ ప్రోగ్రాం మేనేజర్ లక్ష్మణ్, స్టాఫ్ నర్స్ సౌందర్య, అంజిరెడ్డి, శ్రీనివాస్, అకౌంటెంట్ రమేష్ పాల్గొన్నారు.

## పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారాన్ని అందించాలని ఏసీడీపీఓ సల్మా సుల్తానా అన్నారు. మంగళవారం మెదక్ మండలం మక్త భూపతి పూర్ గ్రామంలో గల అంగన్‌వాడీ 1, 2 కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పిల్లల బరువు, ఎత్తు చూసి తల్లిదండ్రులకు తెలియజేయాలని అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. కొద్దిసేపు పిల్లలతో మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారులకు యూనిఫాం అందజేశారు. గర్భిణులకు, బాలింతలు నిర్ణీత సమయం ప్రకారం ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని గర్భిణులకు సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాధవి, అంగన్‌వాడీ టీచర్లు మహేశ్వరి, అఖిల, ఆయా లావణ్య, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555